TRUTH CENTERED TRANSFORMATION

MODULE 1



# పరిపూర్ణ పరిచర్యకు పరిచయం

# ఉపాధ్యాయ సహకారి

సత్యం కేంద్రంగా రూపాతంరం అనేది సమాధాన పరచబడిన ప్రపంచం (రికన్సైల్డ్ వర్ల్డ్) వారి పరిచర్య. మరింత తెలుసుకోవడానికి www.tctprogram.org చూడండి.

Reconciled World

సత్యం కేంద్రంగా రూపాంతరం – కరదీపిక 1: పరిపూర్ణ పరిచర్యకు పరిచయం కాపీరైట్ @2020 వర్షన్ 4.3. కాపీరైట్ రికన్సైల్డ్వర్ల్డ్, ఫినిక్స్, అరిజోనా, అమెరికా, www.reconciledworld.org

క్రియేటివ్ కామన్స్ అట్రిబ్యూషన్–షేర్ఎలైక్ 3.0 లైసెన్స్ నిబంధనలకు లోబడి ఈ పుస్తకం అందుబాటులో ఉంది. ఈ క్రింద ఇచ్చిన షరతులతో ఈ పుస్తకాలను మీరు నకలు చేసి, పంచడానికి అనుమతి ఇస్తున్నాము:

ఆపాదన – ఈ వాక్యముతో ఈ పుస్తకాన్ని/దీనిలోని అంశాలను మీరు ఆపాదించవచ్చు: కాపీరైట్ లీ 2012. క్రియేటివ్ కామన్స్ అట్రిబ్యూషన్–షేర్ఎలైక్ 3.0 లైసెన్స్ నిబంధనలకు లోబడి, రికన్సైల్డ్ వర్ల్డ్ (www.reconciledworld.org) వారి ద్వారా ప్రచురించబడిరది. మరింత సమాచారం కోసం www.creativecommons.org చూడండి.

వ్యాపారేతర వినియోగం కోసం – ఈ పుస్తకాన్ని వ్యాపారార్థం ఉపయోగించరాదు.

ఈ పుస్తకాన్ని/పుస్తకాలను అనువదించుటకు మీరు ఆసక్తి చూపితే, దయచేసి info@tctprogram.org సంప్రదించండి.

ప్రత్యేకంగా సూచించకపోతే, ఇందులోని లేఖనాలన్నీ బైబిల్ సొసైటీవారి పరిశుద్ధ గ్రంథం, పాత అనువాదం నుండి స్వీకరించాము.

# కృతజ్ఞతలు

ఈ పుస్తకాలు సిద్ధపరచడంలో పాలుపొంది, ఈ కార్యక్రమం అంతటినీ సిద్ధపరచినవారికి కృతజ్ఞతలు చెప్పడానికి ఇది ఒక చిన్న ప్రయత్నం. ఆరంభంలో దీనికి ప్రేరణ, డిసైపల్ నేషన్స్ అలయన్స్ నుండి డారో మిల్లర్, హార్వెస్ట్ ఫౌండేషన్ నుండి బాబ్ మొఫిట్‌ల నుండి వచ్చింది. నేను 'ఫుడ్ ఫర్ ద హంగ్రీ'తో పనిచేసిన కాలంలో ఈ కార్యక్రమం పెంపొందించి, అమలు చేసాను. ఈ ఆలోచనలన్నీ పరీక్షించడానికి అవకాశం ఇచ్చి, అది సాధ్యమయ్యేందుకు సహకారం అందించిన వారికి నేను కృతజ్ఞుడను.

ఈ మొదటి మాడ్యూల్‌లో నేను అత్యధికంగా బాబ్, డారోలనుండి స్వీకరించాను. ముఖ్యంగా డారో మిల్లర్ రాసిన ''డెవెలప్‌మెంట్ ఎథిక్'', బాబ్ మొఫిట్ రాసిన ''లీడర్‌షిప్ డెవెలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం'' నుండి స్వీకరించాను. ఈ పాఠాలను తయారుచేయడానికి కొన్ని ఆలోచనలు మార్క్ విల్సన్ నుండి కూడా తీసుకున్నాను. పాఠం 8లోని 'నదిదాటిన కథ' నా సొంతం కాదు. కాని అది అనేక పుస్తకాలలో ఇవ్వబడినందున దాని అసలు రచయితను నేను కనుగొనలేకపోయాను.

అనేక సంవత్సరాలుగా ఈ ఆలోచనలు చదివి, ఆచరించి అమలు చేసిన వారందరితో పనిచేయడాన్నిబట్టి వారందరికీ నేను చాలా ఋణపడివున్నాను. వాళ్ళే నా నిజమైన హీరోలు. వాళ్ళు అమలు చేయడం, నాకు నివేదించడమే ఇది చేయడానికి సాధ్యమైంది. ఇది నేను చేయలేను, వదిలేద్దాం అనుకున్నప్పుడల్లా, వాళ్ళ ప్రోత్సాహం నన్ను వెన్నంటి ఇంతకాలం నడిపిస్తూ వచ్చింది. ఏమి బోధించాలో, ఎలా బోధించాలో నేను నేర్చుకుంటూ నేర్పిస్తున్నపుడు, పూర్తి గందరగోళంలో నేర్చుకున్న మొదటి తర్ఫీదు బృందానికి నేను ప్రత్యేకమైన రీతిలో కృతజ్ఞుడను. తరువాత కాలంలో అవి వారి నేపథ్యానికి చాలా సంక్లిష్టమైనవని మేము గుర్తించిన విషయాలను వాళ్ళు ఓపికగా అర్థం చేసుకోవడానికి, బోధించడానికి ప్రయత్నించారు. అయినప్పటికీ దేవుడు వారి సమాజాలను పేదరికంనుండి విడిపించాడనేది మరొక విషయం. ఇది నా గురించి లేక నేను చేస్తున్న దాన్ని గురించి కాదుగాని దేవుని గురించి ఆయన చేస్తున్నదాన్ని గురించి అని నేను ఎల్లప్పుడూ జ్ఞాపకం చేసుకోవాలనుకుంటున్నాను. ఈ కథలో భాగంగా ఉండి, నా బలహీనతలన్నిటికీ అతీతంగా నేను వాడబడడానికి అనుమతించిన దేవునిబట్టి నేను ఎంతగానో కదిలించబడ్డాను. ఆయనకే సమస్తమహిమ చెల్లునుగాక!

చివరిగా, ఈ కార్యక్రమంలో నాతోకలసి పనిచేయడానికి తన సొంత పరిచర్యను విడిచిపెట్టిన ఆన భర్తకు కృతజ్ఞతలు చెల్లించాలని భావిస్తున్నాను. ఆయన లేకుండా ఇది ఏమాత్రం సాధ్యమయ్యేది కాదు. ఇది సాధ్యం కావడానికి అనేక సంవత్సరాలుగా నీవు చేసిన అనేక త్యాగాలు నాకు తెలుసు. నేను ఎగిరేటట్లు నా రెక్కలకు ఆధారమైన గాలి నీవే. నేను నిన్ను ప్రేమిస్తున్నాను.

అన్నా హో
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

# మీరు ఆరంభించడానికి ముందు

## ఒక పాఠాన్ని బోధించడానికి సిద్ధపాటు

1. **ఉపాధ్యాయుని మార్గదర్శిని**ని సాధ్యమైతే అనేకసార్లు జాగ్రత్తగా చదవండి. ముఖ్యమైన విషయాలు మీకు జ్ఞాపకం ఉండేలా పేజీల పక్కన నోట్సు రాసుకోండి లేదా ఆ విషయాల క్రింద గీత గీసుకోండి లేదా హైలైట్ చేసుకోండి.
2. ఆ పాఠం ద్వారా విద్యార్థులు ఏమి నేర్చుకోవాలో అనేది మీకు తెలియడానికి, దానిలోని **ముఖ్యమైన ఆలోచనలు**/విషయాలకోసం చూడండి.
3. **వాక్య భాగాలు** అన్నీ ముందుగానే చదువండి.
4. ప్రతి పాఠంలోను అవసరమైన **వస్తువులు** ఏమిటో చూచుకొని, విద్యార్థుల మార్గదర్శినిలు (చేతికిచ్చేవి) ఉన్నాయో లేదో చూచుకొని, పాఠంలో ఉపయోగించే దృశ్య సహకార పరికరాలను కనిపెట్టండి.
5. పాఠంలోని ప్రతి **పని** (పోషించే పాత్రలు, ఆటలు, దృశ్య సహకార పరికరాలు) మీరు బాగా ఎరిగి ఉండేలా చూచుకోండి. మీ కుటుంబంతో లేక స్నేహితులతో వాటిని మీరు అభ్యాసం చేయవచ్చు.
6. దేవుడు వారితో ఏమి మాట్లాడుతున్నాడో వినగలుగునట్లు విద్యార్థులను ఆయన సిద్ధపరచునట్లు **ప్రార్థించండి**. అన్ని అంశాలను బోధించడానికి మీకు సహాయం కోసమై కూడా ఆయనను ప్రార్థించండి. ప్రజలు మార్పు చెందడం మనం చూడాలంటే అది కేవలం దేవుని బలంద్వారా మాత్రమే సాధ్యమని గుర్తుంచుకోండి.

## ప్రభావవంతంగా బోధించడానికి సహాయపడే సూచనలు

1. మీరు వాడుకునే ప్రదేశానికి ముందుగా వచ్చి, వాడుకోబోయే అన్ని వస్తువులను సిద్ధం చేసుకోండి.
2. పాఠాలను పూర్తి చేయడానికి తొందరపడకండి. చర్చ, కార్యక్రమాలు, విశ్రాంతి సమయాలకు తగిన సమయం ఉండేలా ప్రణాళిక చేసుకోండి. ప్రజలు అర్థం చేసుకొని నేర్చుకొనే ప్రక్రియలో నిమగ్నమవ్వడానికి సమయమివ్వడం మన లక్ష్యం. అందరికీ అర్థమయ్యేంత వేగంతోనే ఒక అంశంనుండి మరొక అంశానికి వెళ్ళేటట్లు జాగ్రత్తపడండి. కొన్ని మాడ్యూల్స్ పాఠాలకోసం ఒక పూట లేకపోతే ఒక రోజంతా పట్టవచ్చు.
3. తరచుగా సమీక్షించండి. ప్రతి సెషన్‌కు ముందు తర్ఫీదులో వారు అంతవరకు నేర్చుకున్నదంతా సమీక్షించేటట్లు చూడండి. నేర్చుకున్నది గుర్తుండడానికి మరలా మరలా జ్ఞాపకం చేయడం ప్రజలకు సహాయపడుతుంది.
4. ఉపాధ్యాయుని మార్గదర్శిని, మీరు సిద్ధపరచుకొన్ని నోట్సు అనుసరించండి.
5. పాఠంలోని నాలుగు భాగాలూ ఉండేటట్లు జాగ్రత్తగా చూచుకోండి:
    - ఎ. అంశాన్ని పరిచయం చేయడం – మీరు సిద్ధపరచిన కార్యక్రమాలు వారికి అంతకు ముందున్న అనుభవాలకు తోడౌతుంది.
    - బి. కొత్త సమాచారం ఇవ్వండి – కొత్త సమాచారాన్ని పంచుకోవడానికి అనేక మార్గాలున్నాయి.
    - సి. వారు నేర్చుకున్న వాటినుండి చేయడానికి విద్యార్థులకు పని ఇవ్వండి – ఇతరులతో కలసి పనిచేయడం, ఏదైనా ఒక విషయాన్ని కనిపెట్టడం లేక ఏదొక విధానంలో కొత్త సమాచారాన్ని ఉపయోగించడంవల్ల వారు పాఠాన్ని మరింత బాగా అర్థం చేసుకోగలరు.
    - డి. పాఠాన్ని వారి జీవితాలతో జతచేయండి – తమ జీవితాలలో వారు నేర్చుకున్న కొత్త సమాచారాన్ని ఏ నిర్దిష్టమైన విధానాలలో అన్వయించుకుంటారో విద్యార్థులు నిర్ణయించుకోవడానికి సహాయపడే దశ ఇది. నేర్చుకొని అన్వయించుకోకుండా ఉండడం ఎలాంటి మార్పును తీసుకురాదు. అది అసలు ఉపయోగపడదు.
6. నిర్వాహకుని మెరుగుచేసే తర్ఫీదులో మీకు నేర్పిన పెద్దలకు నేర్పించే నియమాలు, ఇంకా మిగిలిన నైపుణ్యాలను సమీక్షించుకోండి.
    - ఎ. స్పష్టమైన నిర్దేశాలను ఇవ్వండి.
    - బి. అవును/కాదు అనే జవాబులు కాకుండా వివరణ చెప్పాల్సివచ్చే ప్రశ్నలు ఎక్కువగా అడగండి.
    - సి. వారు పాల్గొన్నందుకు కృతజ్ఞతలు చెప్పండి.
    - డి. కనుగొనడం ద్వారా వారు మెరుగ్గా నేర్చుకునే విషయాలనుగూర్చి వారికి చెప్పకండి.
    - ఇ. వారికి అప్పటికే తెలిసిన విషయాలనుండి నేర్పుతూ, వారి అనుభవాలను గుర్తించండి.
    - ఎఫ్. ఓపికగా ఉండండి. ప్రజలు స్పందించేవరకు ఎదురుచూడండి.

7. చర్చలలో ప్రతి ఒక్కరూ పాల్గొనేటట్లు, పంచుకొనేటట్లు, తమవంతు చెప్పేందుకు ప్రోత్సహించండి. కొంచెం సిగ్గుపడేవారికి వారిని ఇబ్బందిపెట్టకుండా సున్నితంగా ప్రోత్సహించే మార్గాలను వెదకండి.
8. మీకు, విద్యార్థులకు కొత్త విషయాలను దేవుడు బయల్పరచునట్లు రోజంతా ప్రార్థిస్తూ ఉండండి.

## ఈ ఉపాధ్యాయుని సహకారిని ఎలా వాడాలి?

1. **ముఖ్యమైన తలంపులు, వస్తువులు**: ప్రతి పాఠం ఈ భాగంతో ఆరంభమౌతుంది.
    - ఎ. **ముఖ్యమైన తలంపులు** – ఇవి ప్రతి పాఠం పూర్తయ్యేసరికి విద్యార్థి స్పష్టంగా అర్థం చేసుకోవలసిన అతి ముఖ్యమైన ఆలోచనలు. ప్రతి పాఠం పూర్తయిన తర్వాత విద్యార్థులు ఈ తలంపులను అర్థం చేసుకున్నారో లేదో జాగ్రత్తగా చూచి, పాఠాన్ని సమీక్షించడానికి సమయం తీసుకోండి.
    - బి. **వస్తువులు** – ప్రతి పాఠంకోసం అవసరమైన నిర్దిష్టమైన వస్తువుల జాబితా ఇచ్చాం.
        - i. **దృశ్య సహకారులు** – దీన్ని ఈ విధంగా సూచిస్తాం. వీటిని ముందుగానే ప్రింట్ చేసుకోవాలి.
        - ii. ఎక్కువమందితో కూడిన బృందానికి మీరు బోధిస్తుంటే చార్టులు, వైట్ బోర్డు లేక బ్లాక్ బోర్డును వాడమని మేము సూచిస్తాం.
        - iii. విద్యార్థి సహకారులు ఐచ్ఛికం (అవసరమైతే వాడవచ్చు). పాఠంలోని ఏ భాగమైనా విద్యార్థి సహకారి పేజీని సూచిస్తుంటే దాన్ని ఉపధ్యాయుని సహకారిలో **(వి.స.)** అని సూచిస్తాం.
2. **నిర్వాహకునికి సూచనలు**: తర్ఫీదును చక్కగా నడిపించడానికి మీకు ప్రత్యేకమైన సూచనలు ఉన్నాయి. వీటిని మీరు విద్యార్థులతో చెప్పకూడదు. చర్చలు, కార్యక్రమాలను నడిపించడానికి వీటిని మీరు ముందుగా చదివి సిద్ధపడాలి. కొన్ని ప్రశ్నలకు ఇచ్చిన జవాబులలో కొన్ని వంగివున్న అక్షరాలుగా (ఇటాలిక్స్)కనిపిస్తాయి. అవి ఉపదేశకునిగా మీరు విద్యార్థులకు ఏ ఆలోచనలను నొక్కి చెప్పాలో తెలియజేస్తాయి. ఇవిమాత్రమే ఇచ్చిన ప్రశ్నలకు మంచి జవాబులు కావు, ఇవి కూడా కొన్ని మంచి జవాబులు.
3. **సమయపాలన, పాఠం జరిగే వేగాన్ని నిర్వహించడం**: ప్రతి పాఠానికి సమయం ఇంత అని ఇవ్వలేదు.
    - ఎ. పాఠంలోని తలంపులను నేర్చుకోవడానికి ఎంత సమయం కావాలంటే అంత సమయం తీసుకోండి. నియమిత సమయంలో పాఠం పూర్తి చేయడంకంటే విద్యార్థులు ఏమి నేర్చుకుంటున్నారు అనేదే ప్రాముఖ్యం/విలువైనది.
    - బి. నిర్వాహకులు ధ్యానములతో, సాక్ష్యాలు పంచుకోవడంతో ఆరంభించడానికి, వారికి సమస్యలేమైనా ఉంటే వాటిగురించి చర్చించడానికి, కలసి ప్రార్థించడానికి సమయం ఉండేటట్లు జ్ఞాపకం ఉంచుకోండి.

# పాఠం 1: పూర్తి కథ

**ముఖ్యమైన తలంపు**
కేవలం ఆత్మలు రక్షింపబడాలనేదే దేవుని ప్రణాళిక కాదుగాని, పాపంవల్ల మనిషి పతనమైనప్పుడు తెగిపోయిన మూడు సంబంధాలు, అంటే దేవునితో మన సంబంధం, ఒకరితో ఒకరికి ఉన్న సంబంధం, మిగిలిన సృష్టితో ఉన్న సంబంధం – తిరిగి సమకూర్చబడాలి అనేది.

**వస్తువులు**

1. దృశ్య సహకారులు:
    - ఎ. మూడు సంబంధాలు (నాలుగు చిత్రాలు: సృష్టి, పాపంలో పడడం, సిలువ, రెండవరాకడ)
    - బి. ఆదాము, హవ్వల పాత్రలపోషణ (2 ప్రతులు)

## పరిచయం

**పెద్ద బృందంతో చర్చ**

- యేసు ఎందుకు మరణించాడు?

***నిర్వాహకునికి సూచనలు**: ఎక్కువ జవాబులు వచ్చేటట్లు ప్రోత్సహించండి. సరియైన జవాబు ఒక్కటే ఉండదని విద్యార్థులకు జ్ఞాపకం చేయండి. సరియైన జవాబులిచ్చిన వారందరినీ అభినందించండి.*

యేసు మనలను మన పాపాలనుండి రక్షించడానికి వచ్చాడని మనం సాధారణంగా చెబుతాం. అది నిజమే కాని ఆయన దానికంటే ఇంకా చాలా చేయడానికి వచ్చాడు. ఆయన సిలువ మరణం పూర్తి కథలో కేవల ఒక్క భాగమే. బైబిల్ ఇచ్చే సందేశాన్ని నిజంగా అర్థం చేసుకోవాలంటే, మొదటినుండి చివరివరకు పూర్తి కథను మనం అర్థం చేసుకోవాల్సివుంది.

## సృష్టి

**పెద్ద బృందంతో చర్చ**
దేవుడు లోకాన్ని ఎలా సృష్టించాడు అనేదాన్నిగురించి మీకు తెలిసిన విషయాల ఆధారంగా, ఈ ప్రశ్నలకు మీరు ఎలా జవాబు ఇస్తారు?

- ఆదాముకు, దేవునికి మధ్య ఉన్న అనుబంధం ఎలాంటిది? *(ఆది 1:26-27, 31)*
- ఆదాముకు, హవ్వకు మధ్య ఉన్న అనుబంధం ఎలాంటిది? వాళ్ళిద్దరూ ఎక్కువగా వాదించుకున్నారని మీరు అనుకుంటున్నారా? *(ఆది 2:23-25)*
- ఆదాముకు సృష్టితో ఉన్న అనుబంధం ఎలాంటిది? ఆదాముకు అవసరమైనవన్నీ అతనికి ఉన్నాయా? అతనికి తగినంత ఆహారం ఉందా? *(ఆది 1:29-30)*

***నిర్వాహకునికి సూచనలు: దృశ్య సహకారులు** చిత్రం 1: సృష్టి చూపించి, ఆరంభంలో, పాపంలో పడడానికి ముందు ఈ మూడు అనుబంధాలు పరిపూర్ణంగా ఉన్నాయని విద్యార్థులకు అర్థమయ్యేటట్లు చూడండి.*

## పాపంలో పడడం/పతనం

ఆది 3:1-20 చదవండి.

**నాటిక**
***నిర్వాహకునికి సూచనలు:** ఈ కింద ఇచ్చిన నాటికను చేయమని ఇద్దరికి చెప్పండి. స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ఇద్దరికి ఈ నాటికను ఇవ్వండి.*

‘‘ఆదాము, హవ్వల సంభాషణ’’

ఆదాము: (సేద్యం చేస్తూ,) హవ్వా, ఆ పండు తినడంద్వారా మనం దేవున్ని బాధపెట్టినప్పటినుండి తోట పని చాలా కష్టంగా మారింది కదా!

హవ్వ: అవును, మన పిల్లలిద్దరికీ కూడా ఒకరంటే ఒకరికి పొసగడం లేదు. రోజంతా ఒకరితో ఒకరు పోట్లాడుకుంటూ కొట్టుకుంటున్నారు. అంతకు మించి రాద్ధాంతం కాకూడదని ప్రార్థన చేస్తున్నాను. ఈ చెత్త అంజూరపు ఆకులు, చూడ్డానికి అస్సలు బాగా లేవు, కాని నేను వాటిని కట్టుకోవాల్సివస్తుంది.

ఆదాము: (వాదిస్తూ) నిజమే, మనం కొత్త బట్టలు కొనుక్కోలేము, కాబట్టి చిరాకు పడకు. (ఆగి) దేవుడు మనతో మాట్లాడుతూ, నడుస్తూ ఉన్న పూర్వపు రోజులు నాకు గుర్తొస్తున్నాయి. కాని ఇప్పుడు మనం ఆయన చుట్టుపక్కల ఉంటేనే బాధపడుతున్నాడు. జంతువులు మనకు ఎలా లోబడేవో నీకు గుర్తుందా? ఇప్పుడు అవి మనల్ని చూస్తే భయపడి పారిపోతున్నాయి!

హవ్వ: నిజమే, లేకపోతే అవి మనల్ని కరవడానికి ప్రయత్నిస్తున్నాయి! ఛఛ... నాకు పాములంటే అసహ్యం! నేను ఒక పాము సలహా తీసుకున్నాను అని నమ్మడానికే నాకు ఆశ్చర్యంగా ఉంది! ఈ తిప్పలన్నిటికీ ఆ పాము చేసిన తప్పే కారణం!

ఆదాము: కాదు, ఇదంతా నీ తప్పే! అసలు నీవెప్పుడూ మంచి పని చేయ్యలేదు! పాము చెప్పిన ఆలోచన విన్నదానివి నీ ఆలోచన నేను వినడం ఏమిటి నా ఖర్మ కాకపోతే!

హవ్వ: సరే, నా మీద నింద వేయకు. అది నీ తప్పే! (ఆగి, విచారంగా) నన్ను క్షమించు. అరుచుకుంటే లాభం ఏముంది? ఆదామా, మళ్ళీ పరిస్థితులన్నీ చక్కబడి, ఇదివరకటిలా మారతాయని నీకనిపిస్తుందా?

ఆదాము: నాకేం తెలుసు. ఈ పరిస్థితిని దేవుడే చక్కదిద్దగలడు!

హవ్వ: అయ్యో! ఇప్పుడేమైంది? (కేకలు పెడుతూ పరుగెత్తుతూ) మీరిద్దరూ కొట్టుకోవడం మానరా! అపండిరా! నా మాట వినబడుతుందా? మీ నాన్నకు చెప్పేస్తాను. ఆయనకు ఏమాత్రం సంతోషంగా ఉండదు తెలుసా?

ఆదాము: (తోటకు తిరిగివెళుతూ, నిట్టూరుస్తూ) పని, పని, పని, పని, .......

**పెద్దబృందంతో చర్చ**

ఈ నాటికనుండి, మీరు బైబిల్లో చదివినదానినుండి పాపంలో పడడంవల్ల ప్రజలు ఎదుర్కొనే కొన్ని సమస్యలు ఏమిటో చెప్పండి?

- ఆది 3:8,10 చదవండి – పాపంలో పడినప్పుడు ప్రజలకు దేవునితో ఉన్న సంబంధానికి ఏమైంది?
- ఆది 3:12 చదవండి – పాపంలో పడినప్పుడు ప్రజలకు ఒకరితో ఒకరికున్న సంబంధానికి ఏమైంది?
- ఆది 3:15 చదవండి – పాపంలో పడినప్పుడు ప్రజలకు సృష్టితో ఉన్న సంబంధానికి ఏమైంది?

పాపంలో పడినప్పుడు చెడు లోకంలోకి ప్రవేశించింది. కేవలం నైతికమైన చెడుగు మాత్రమే కాదు గాని భౌతికమైన చెడు కూడా వచ్చింది. పాపంలో పడడానికి ముందు తగినంత ఆహారం ఉంది, భూకంపాలు లేవు, వరదలు లేవు, కరవులు లేవు. పాపంలో పడిన ఫలితంగా ఇవన్నీ ఇప్పుడు వచ్చాయి.

పాపంలో పడడం ఈ మూడు అనుబంధాలను పాడుచేసింది.

***నిర్వాహకునికి సూచనలు: దృశ్య సహకారి చిత్రం*** *2: పాపంలో పడడం చూపించి, పాపంలో పడడంవల్ల ఈ అనుబంధాలన్నీ దెబ్బతిన్నాయని చూచేందుకు విద్యార్థులకు సహాయం చేయండి.*

## మిషన్/పని

దేవునికి ఆయన సృష్టికి మధ్య ఉన్న కథ తరువాతి దశ పాపంలో పడినప్పటినుండి పాత నిబంధన ఆఖరివరకు చూడవచ్చు.

***నిర్వాహకునికి సూచనలు***: *మీరు చెప్తున్న పెద్ద భాగాన్ని క్లాసులో ఉన్నవాళ్ళకు బైబిల్లో చూపించండి.*

ఈ దశలో దేవుడు తన ప్రజలకోసం వెదకుతున్నాడు. తెగిపోయిన బంధాన్ని తిరిగి సమకూర్చాలనేది ఆయన కోరిక.

**అబ్రాహాము** – ఆది 12:1–3 చదవండి. ఈ భాగంలో దేవుడు అబ్రాహామును లేవనెత్తి, అతన్ని దీవించాడు. ఆయన అబ్రాహామును ఎందుకు దీవించాడు? (*దేవుడు ప్రజలందరినీ దీవించాలని కోరుకున్నాడు*). ఈ ఒక్క వాక్యభాగంలోనే లోకమంతటినీ రక్షించాలనే దేవుని ప్రణాళిక మనం చూస్తాం. సంఘంద్వారా ఆయన ప్రజలందరికీ దీవెన ఇవ్వాలని కోరుకుంటున్నాడు.

**మోషే** – తెగిపోయిన సంబంధాలను తిరిగి సమకూర్చుకోవడం ఎలాగో మనకు తెలిసేటట్లు దేవుడు లోకానికి పది ఆజ్ఞలను ఇచ్చాడు.

- ధర్మశాస్త్రం కేవలం ఆత్మీయ సంగతులనుగురించేనా లేక ఒకరితో ఒకరికి, మనకు ప్రకృతికి ఉన్న సంబంధాలనుగూర్చి కూడా చెబుతుందా?

మొదటి నాలుగు ఆజ్ఞలు మనకు దేవునితో ఉన్న సంబంధాన్ని పునరుద్ధరించేవి. మిగిలిన ఆరు ఏ సంబంధాన్ని పునరుద్ధరిస్తాయి? (*మనకు ఒకరితో ఒకరికి ఉన్న సంబంధం*). ధర్మశాస్త్రం అంతా దేవునితో మనకున్న సంబంధాన్ని (నిర్గమ 21:3), మనకు ఒకరితో ఒకరికున్న సంబంధాన్ని (ఉదా: నిర్గమ 21:12), అలాగే మనకు సృష్టితో ఉన్న సంబంధాన్ని కూడా చూపిస్తూ ఉంది (నిర్గమ 23:10–12). ప్రజలు ఆరోగ్యంగా ఉండడానికి సహాయపడే నిర్దిష్టమైన నియమాలు ఉన్నాయి (ఉదా: లేవీ 13). ఒకరితో ఒకరు ఎలా ఉండాలో చెప్పేవి ఉన్నాయి (ఉదా: నిర్గమ 23:1–9). దేవుడు కేవలం ఆత్మీయమైన విషయాలనుగురించి మాత్రమే కాక మన జీవితంలోని అన్ని విషయాలను గురించి శ్రద్ధచూపుతున్నాడు. అందువల్లనే పాపంద్వారా తెగిపోయిన మన జీవితంలోని ప్రతి విభాగానికి ఆయన నియమాలను సృష్టించాడు.

ద్వితీ. 28:1–14 చదవండి.

- తన ప్రజలు ఈ ఆజ్ఞలను పాటిస్తే ఎలాంటి పరిణామాలు వస్తాయని దేవుడు చెప్పాడు?
- ఆశీర్వాదాలకు సంబంధించిన దేవుని వాగ్దానాలు కేవలం ఆత్మీయమైన విషయాలకేనా లేక భౌతిక జీవితానికి సంబంధించి కూడా ఉన్నాయా?

దేవుడు రాజులను, ప్రవక్తలను లేవనెత్తుతూ వచ్చాడు. కాని ఇశ్రాయేలీయులు అనేకసార్లు పేదరికంతో, యుద్ధంతో బాధింపబడ్డారు. ఎందుకంటే వాళ్ళు దేవునివైపు తమ వీపు తిప్పి ఆయన ఆజ్ఞలను పాటించలేదు కనుక.

2దిన 7:14 చదవండి.

- తమను తాము తగ్గించుకొని, ప్రార్థించడానికి దేవుడు ఎవరిని పిలిచాడు? *(ప్రజలందరినీ కాదు గాని తన ప్రజలందరినీ –నేడు క్రైస్తవులను.)*
- వాళ్ళు విధేయత చూపితే ఏమి జరుగుతుందని దేవుడు చెప్పాడు? (దేవుడు మన దేశాన్ని స్వస్థపరస్తాడు). నేటికీ ఇది నిజమే. జీవితాలు రక్షించబడతాయని మాత్రమే దీని అర్థం కాదు. దేవునితో మనకున్న సంబంధం, ఒకరితో ఒకరికి ఉన్న సంబంధం, సృష్టితో ఉన్న సంబంధం అనే మూడు సంబంధాలను దేవుడు స్వస్థపరస్తాడని ఈ వచనం మనకు తెలియజేస్తూ ఉంది.

## సిలువ

కథలో ఇది చాలా అద్భుతమైన భాగమే కాదుగాని చాలా ముఖ్యమైన భాగం కూడా. సుమారుగా అన్ని మతాల్లోనూ తమ దేవుళ్ళను సంతోషపరచడానికి ప్రజలు బలులు అర్పించాల్సివుంటుంది. క్రైస్తవ్యంలో దేవుడు మానవాళిని ఎంతో ప్రేమించి మన కోసం మరణించడానికి తన కుమారుని లోకానికి పంపాడు.

కొలస్సీ 1:19–20 చదవండి. యేసు ఎందుకు మరణించాడు?

- *అన్ని సంబంధాలను తిరిగి సమకూర్చడానికి/సరిచేయడానికి*

***నిర్వాహకునికి సూచనలు: దృశ్య సహకారులు*** *చిత్రం 3: సమకూర్చడం చూపించి, పాపంలో పడినప్పుడు తెగిపోయిన అన్ని సంబంధాలను పునరుద్ధరించడానికి యేసు వచ్చాడని వివరించండి. అయితే కథ చివరిభాగం వరకు అన్నీ పరిపూర్ణం కావు.*

యేసు గొప్ప ఆదేశాన్ని మనకిచ్చి వెళ్ళాడు. ప్రజలు క్రైస్తవులుగా మారడం చూడడంతోనే మన బాధ్యత పూర్తికాదు గాని సర్వజనులను శిష్యులుగా చేయడం కూడా మన బాధ్యతే. సర్వజనులను శిష్యులుగా చేయడం అంటే యేసు పునరుద్ధరించాలని వచ్చిన అన్ని విషయాలలో ప్రజలు దేవుని ఉద్దేశాలను అనుసరించేటట్లు వారికి సహాయం చేయడమే.

## తిరిగి రావడం /రెండవ రాకడ

**పెద్ద బృందంతో చర్చ**

ప్రకటన 21:1–7 చదవండి.

- చివరికి, దేవునితో ప్రజల సంబంధం ఎలా ఉండబోతోంది?
- ఒకరితో ఒకరికి ప్రజల సంబంధాలు ఎలా ఉండబోతున్నాయి?
- ప్రజలకు ప్రకృతితో ఉండే సంబంధం ఎలా ఉండబోతోంది? మనకు తినడానికి తగినంత ఉంటుందా? మనకు ఎన్నడైనా అనారోగ్యాలు వస్తాయా?

***నిర్వాహకునికి సూచనలు: దృశ్య సహకారులు*** *చిత్రం 4:రెండవ రాకడ చూపించి, యేసు తిరిగి వచ్చినపుడు ఆదిలో మన సంబంధాలన్నీ ఎలా ఉండాలని దేవుడు ఉద్దేశించాడో అన్ని సంబధాలు పూర్తిగా సమకూర్చబడతాయని విద్యార్థులు అర్థంచేసుకునేటట్లు వివరించండి.*

## ముగింపు

మొత్తం కథ ఇది– దేవుడు ఒక లోపరహితమైన /పరిపూర్ణ లోకాన్ని ఎలా సృష్టించాడో, ఆ లోకంలోకి పాపం ఎలా ప్రవేశించి దేవునితో, ఒకరికి ఒకరితో, ప్రకృతితో మన సంబంధాలను ఎలా తెంచివేసిందో, ఎలా దేవుడు మనలను ఎంతో ప్రేమించి తన కుమారుని పంపి పాపంలో పడడంవల్ల తెగిపోయిన మన సంబంధాలన్నీ తిరిగి సమకూర్చాడో, అలాగే దేవుడు ఒకరోజున మరలా తిరిగివచ్చి సమస్తాన్నీ ఎలా నూతన పరస్తాడో మొదటినుండి చివరికి వరకు జరిగే అద్భుతమైన కథ!

దేవుడు నిన్ను చాలా ప్రేమిస్తున్నాడు. నీకు తనతోను, ఇతరులతోను, సృష్టితోను సరియైన సంబంధం ఉండాలని వాటిని పునరుద్ధరించడానికి మరణించడానికై తన కుమారుని పంపాడు.

# పాఠం 2: దేవునికి మానవులు ముఖ్యమైనవారు

**ముఖ్యమైన తలంపు**
మనుషులంతా దేవుని పోలికలో చేయబడ్డారు కాబట్టి వాళ్ళందరూ ఆయనకు విలువైనవారే. సాధారణంగా బాధింపబడే వారితో సహా ప్రతివారితోను, వాళ్ళు దేవుని ప్రశస్తమైన సృష్టిగానే మనం వ్యవహరించాలి.

**వస్తువులు**

2. విద్యార్థి సహకారి (వి.స.) (కావాలంటే ఇవ్వవచ్చు)
    ఎ. దేవుని పోలికలో చేయబడ్డాం ప్రశ్నలు

## పరిచయం

**పెద్ద బృందంతో చర్చ**
కాంగో దేశంలో అనేక సంఘాలు వేశ్యలకు సువార్త అందించడం ఆరంభించి, వారిని సంఘానికి చెందిన భవనాల్లో ఉండడానికి అనుమతించి, వారికి బట్టలు కుట్టడం నేర్పించారు. ఈ వేశ్యలు వివాహం కాకముందే గర్భవతులైనందున వారి కుటుంబాలు వారిని ఇంటిలోనుండి వెళ్ళగొట్టగా వీధుల్లో నివసిస్తున్న అమ్మాయిలు.

- సంఘం ఇలాంటివారికి సహాయం చేయడం మంచిదని మీరు తలస్తున్నారా?
- లేకపోతే సంఘం వేరే ఇతర ప్రజలపై దృష్టిపెట్టాలని మీకు అనిపిస్తుందా?

## దేవుని పోలికలో చేయబడడం

**పెద్ద లేక చిన్న బృందంతో చర్చ (వి.స.)**
ఆది 1:26–27 చదవండి.

- మిగతా సృష్టికి, మనుషులకు ఉన్న తేడా ఏమిటి? దేవుడు మానవులకు తన మాదిరిగా దేనిని ఉపయోగించాడు?
- మానవులలో కనిపించే దేవుని గుణలక్షణాలలో కొన్ని ఏవి? సాధ్యమైనన్ని గుర్తించండి.

కీర్తనలు 139:13–16 చదవండి.

- ఈ వచనం మానవుని ప్రాముఖ్యతనుగూర్చి మనకు ఏమి చెబుతుంది?
- ఈ వచనం కేవలం కొంతమంది మనుషులకు మాత్రమే వర్తిస్తుందా లేక అందరికీ వర్తిస్తుందా? మీకేమనిపిస్తుంది?

దేవుడు మనలను రూపొందించాడు. మనం శ్రద్ధగా చేయబడ్డాం. మన రోజులన్నీ ఆయన ఒక పుస్తకంలో రాసివుంచాడు. మనం అనుకోకుండా ఈ లోకంలోకి రాలేదు గాని మనలో ప్రతివానిని దేవుడు చేసాడు.

**పెద్దబృందంతో చర్చ**
యోహాను 3:16 చదవండి.

- దేవుడు లోకాన్ని తిరిగి సమకూర్చడానికి ఏమి చేసాడు?
- మనం మంచివాళ్ళం కాబట్టి దేవుడు మనకోసం మరణించాడా? (*వాళ్ళకు అసందిగ్ధంగా ఉంటే రోమా 5:8 చూడండి.*)
- ప్రజలకోసం దేవుడు తన కుమారుని పంపడానికి ఇష్టపడితే, ప్రజలు ఆయనకు ఎంత ప్రాముఖ్యం అని తలస్తున్నట్లు?
- మనం ప్రజలతో వ్యవహరించే విధానంలో ఇది మనకు ఏమి భావాన్నిస్తుంది?

**ఇలా క్లుప్తపరచండి**: ఈ వచనాలలో మనం చూస్తే, ప్రజలను చాలా ప్రాముఖ్యమైనవారిగా దేవుడు భావిస్తున్నాడని మనకు స్పష్టమౌతుంది. ఆయన మనలను తన రూపంలో చేసాడు –మనలో ప్రతివాడు మన తల్లి గర్భంలో జాగ్రత్తగా సృష్టింపబడి, రూపొందించబడ్డాం. ఆయన ప్రజలనుగూర్చి ఎంత శ్రద్ధ చూపుతాడంటే, ఆయన మనకోసం మరణించడానికి తన కుమారుని పంపించాడు.

వేశ్యలకు సహాయం చేస్తున్న సంఘాలనుగూర్చి మరొకసారి ఆలోచించండి.

- వాళ్ళు ఆ వేశ్యలకు సహాయం చేయాలని ఎంచుకోవడానికి ఎందుకు ఎంచుకున్నారో అర్థం చేసుకోవడానికి ఈ ఆలోచనలు మనకు సహాయం చేస్తాయా?

**వ్యక్తిగతంగా తలపోయడానికి**

మనలో ప్రతివారు దేవునికి చాలా విలువైనవారు. మీ సమాజంలో ప్రతి వ్యక్తి కూడా అంతే విలువైనవారు. మీ సమాజంలోని ప్రజలు దేవునికి ప్రశస్తమైనవారుగా మీరు వారితో వ్యవహరిస్తున్నారా అని నిశ్శబ్దంగా ఆలోచించడానికి సమయం తీసుకోండి.

## సందర్భపరిశీలన: ఆది సంఘం

**పెద్దబృందంతో చర్చ**

ప్రజలు చాలా ముఖ్యమైనవారని ఆది సంఘంలోని క్రైస్తవులు అర్థం చేసుకున్నారు. ఆ కాలంలో ఆధిపత్యం కోసం దేవుళ్ళు ఒకరితో ఒకరు యుద్ధం చేస్తూ, తమచేత శిక్ష పొందకుండా ఉండేందుకు మానవులు బలులు అర్పించాలని దేవుళ్ళు కోరేవారని ప్రజలలో ఎక్కువమంది నమ్మేవాళ్ళు. కాని నిజమైన దేవుడు దానికి భిన్నం అని క్రైస్తవులు అర్థం చేసుకున్నారు. బలులు కోరడం కాకుండా మానవులకోసం బలిగా మరణించడానికి తన ఏకైక అద్వితీయ కుమారుని పంపాడు (యోహాను 3:16). ప్రతి మానవుడు చాలా ముఖ్యమైనవాడు, విలువైనవాడు అని యేసు బల్యర్పణ నిరూపించింది. తన లోకంకోసం, మానవాళికోసం దేవునికి ఉన్న ఈ విశిష్టమైన ప్రేమను అర్థం చేసకోవడం ద్వారా ఆది సంఘం గర్భస్రావం, శిశుహత్యలవంటి సాధారణ ఆచారాలను వ్యతిరేకించేటట్లు చేసింది. ఆ కాలంలో ఆడపిల్ల పుడితే తరచుగా ఆ బిడ్డను వీధిలో వదిలేసేవాళ్ళు. అయితే ప్రతి జీవితం –అవయవలోపం, గర్భస్థ శిశువు, స్త్రీ లేక పురుషుడు, బానిస లేక ధవంతుడు– అది ఎవరైనాసరే దేవునికి అత్యంత విలువైనవాళ్ళు అని క్రైస్తవులు అర్థం చేసుకున్నారు. వీధిలో వదిలేసిన ఆడబిడ్డలను వారు కాపాడి, తమ సొంత బిడ్డల్లా వాళ్ళను పెంచేవారు.

మనపక్షంగా దేవుడు తన జీవితాన్ని బలిగా అర్పించడం ద్వారా తన ప్రేమను వ్యక్తపరచాడు కాబట్టి, తాము కూడా అలాగే త్యాగపూరితంగా ఇతరులకు సేవచేయడం తమ ధర్మం అని ఆది సంఘం కూడా భావించింది. దేవుడు తమపట్ల ఎంత కనికరం, దయ చూపుతున్నాడో అలాగే తాము ప్రజలందరిపట్ల కనికరం, దయ చూపించాలని యేసు అనుచరులు అర్థం చేసుకున్నారు. ఆ కాలంలో కలరా అంటువ్యాధి వ్యాపించింది. కలరా వచ్చినవాళ్ళు నీళ్ళు తాగితే వాళ్ళు బ్రతికే అవకాశాలు బాగుండేవి. నీళ్ళు లేకపోతే వాళ్ళు మరణించేవారు. అయితే కలరా వ్యాధి తీవ్రమైన అంటువ్యాధి. రోమీయులు తమకు ఈ వ్యాధిసోకుతుందేమో అనే భయంతో కలరావ్యాధి వచ్చినవాళ్ళకు మంచినీళ్ళు ఇవ్వడానికి బదులు వాళ్ళను మరణించేటట్లు వీధిలోకి తోసివేసేవాళ్ళు. మనిషి ప్రాణమంటే వాళ్ళకు విలువ లేదు. అయితే క్రైస్తవులు భిన్నంగా ఉండేవాళ్ళు. వాళ్ళు కలరా వ్యాధి వచ్చినవాళ్ళ దగ్గరకు వెళ్ళి, వాళ్ళకు నీళ్ళు ఇచ్చి సాకేవారు. త్యాగపూరితంగా సేవచేయడం, దయ చూపడాన్ని వాళ్ళు నమ్మేవారు. అలా చేయడంవల్ల అనేకమంది క్రైస్తవులు కలరా వ్యాధితో మరణించారు. కాని వాళ్ళ ప్రేమను చూచిన ఇతరులలో అనేకులు తమ జీవితాలను క్రీస్తుకు అర్పించారు. సంఘం వేగంగా అభివృద్ధి చెందింది.

**వ్యక్తిగతంగా తలపోయడానికి**

ఈ కథనుగూర్చి నిశ్శబ్దంగా మీలో మీరు ఆలోచించడానికి సమయం తీసుకోండి.
మీరు ఇతరులతో ఎలా వ్యవహరిస్తున్నారో చూడడానికి దేవుని సహాయం కోరండి.

- తాను వాళ్ళకోసం మరణించేటంత ముఖ్యమైనవాళ్ళని దేవుడు తలంచినట్లు మీరు వారితో వ్యవహరిస్తున్నారా?
- మీరు కొంతమందితోనే సరిగ్గా వ్యవహరిస్తూ, ఇతరులతో సరిగ్గా ఉండడం లేదా?

దేవుడు ఇష్టపడని రీతిలో మీరు ఇతరులతో వ్యవహరించిన విధానాలను క్షమించమని దేవుని అడగండి. ఆయన ప్రజలను ఎలా చూస్తున్నాడో మీకు చూపించమని ఆయనను అడగండి.

**చిన్నబృందంతో చర్చ**

- సాధారణంగా తక్కువగా ఎంచబడే ప్రజలలో ఎవరుంటారు?
- వాళ్ళు దేవునికి ముఖ్యమైనవాళ్ళు అని మనం ప్రజలకు తెలియజేయడానికి కొన్ని విధానాలు ఏవి?

# పాఠం 3: దేవుని ప్రేమించడం, మన పొరుగువారిని ప్రేమించడం

**ముఖ్యమైన తలంపు**
మనం దేవుని ప్రేమిస్తున్న విధానాన్ని చూపడానికి మన పొరుగువారిని ప్రేమించడానికి దేవుడు మనలను పిలిచాడు. మన పొరుగువారి అవసరాలు తీర్చడం ద్వారా మనం ఇతరులకు మన ప్రేమను చూపవచ్చు.

**వస్తువులు**

1. దృశ్య సహకారులు:
   ఎ. సువార్తీకరణ నాటిక (3 ప్రతులు)

## పరిచయం – సువార్తీకరణ నాటిక

**నాటిక**
***నిర్వాహకునికి సూచనలు***: *ఈ కింది నాటికలో పాల్గొనడానికి బృందంలోని ముగ్గురు సభ్యులను ఎంచుకోండి. వాళ్ళకు సువార్తీకరణ నాటిక* ***దృశ్య సహకారుల*** *ప్రతులు ఇవ్వండి.*

**వ్యాఖ్యాత పరిచయం**: కొన్నిసార్లు క్రైస్తవులకు ''సువార్తనుగూర్చిన సంకుచిత దృష్టి'' అని మనం పిలిచే లక్షణం ఉంటుంది. యేసును స్వీకరించడం చావు బ్రతుకుల నిర్ణయం అని వాళ్ళు అర్థం చేసుకుంటారు. కాని వాళ్ళు ఇంకొక విషయం అర్థం చేసుకోరు. తమ పొరుగువారి అవసరతలను తాము పట్టించుకోకపోతే, వాళ్ళిచ్చే సందేశం పూర్తిగా అర్థరహితం అని గ్రహించరు. (కొంచెం ఆగి) ఈరోజు ఒక పేద ఇంటి దగ్గరకు మనం వెళ్ళబోతున్నాం. ఈ ఇంటిలో ఉన్న ఒకే ఒక్క వ్యక్తి పేదవాడు, అనారోగ్యంతో మంచాన పడివున్నాడు. ఇంటింటికీ సువార్త చేసే ఒక క్రైస్తవ సువార్తికుడు ఆ ఇంటికి వచ్చాడు.

**సువార్తికుడు (సువా)**: ఏమండీ, ఇంటిలో ఎవరైనా ఉన్నారా? నేను లోపలికి రావచ్చా? (ప్రవేశిస్తాడు)

**వ్యాధిగల పేద వ్యక్తి (వ్యా. పే.):** (నీరసంగా) ఇక్కడున్నానండీ...

**సువా:** నమస్తే. నా పేరు ..............................................., నేను .................................................................... సంఘంనుండి వచ్చాను. ప్రతివారిని మా సంఘానికి ఆహ్వానించడం కోసం నేను ఈ రోజు వచ్చాను. బలమైన ఉజ్జీవంతో ప్రభువు మమ్మల్ని ఆశీర్వదిస్తూ ఉన్నాడు. మీరు కూడా దాన్ని పొందాలని నా ఆశ.

**వ్యా.పే:** (మూలుగుతూ, ఆగి ఆగి మాట్లాడుతూ) రాలేనండి.... మంచంమీదనుండి దిగలేకపోతున్నాను..... కదలలేనంత అనారోగ్యం... నా ఉద్యోగం పోయింది....... మందులు కొనడానికి..... తినడానికి..... అద్దె కట్టడానికి కూడా.... డబ్బులు లేవు......

**సువా:** అవి నిజంగా పెద్ద సమస్యలే, కాని జీవితంలోని సమస్యలన్నిటికీ జవాబు చెప్పగల ఒకరు నాకు తెలుసు. యేసు క్రీస్తును నీ వ్యక్తిగత రక్షకునిగా మీరు స్వీకరించారా?

**వ్యా.పే:** (బలహీనంగా) నాకు అనారోగ్యం చేసి నా ఉద్యోగం పోయిన తర్వాత.... నా కుటుంబం, స్నేహితులు నన్ను విడిచిపెట్టారు.... దయచేసి..... మీ సంఘంలో ఎవరైనా..... నాకు సహాయం చేస్తారా?

**సువా:** నీకు కావల్సిన ముఖ్య సహాయం ఇదిగో... ఈ చిన్న కరపత్రికలో ఉంది. నీ జీవితాన్నిగూర్చిన దేవుని ప్రణాళికను ఇది వివరిస్తుంది. నీవిక్కడ ఇలా పడివుండడం ఆయన చిత్తం కాదని నీకు తెలుసా? ఇది తీసికొని, చదివి, పాపి పశ్చాత్తాప ప్రార్థన చేసి, నమ్ముకో!

**వ్యా.పే:** (పీలగా....) నావల్ల కాదు...... చాలా నీరసంగా ఉంది.... (మాట్లాడడం మానేసి, కదలకుండా పడివుంటాడు)

**సువా:** (నాడి చూసి తనలో తాను) అమ్మయ్య. ఇంకా బ్రతికే ఉన్నాడు. సాక్ష్యమివ్వడానికి నేను సరిగ్గా సమయానికే ఇక్కడికి చేరుకున్నాను. ఈ కరపత్రిక ఇక్కడే పెట్టి, నశించిపోతున్న ఇతరులకు సేవచేయడానికి వెళ్ళడం మంచిది. (వ్యాధిగల వ్యక్తి చెవిలో బిగ్గరగా..) నేను నీకోసం ప్రార్థన చేస్తానులే. గుర్తుంచుకో, ప్రతి దానికి యేసే జవాబు (అని చెప్పి వెళ్ళిపోతాడు).

**వ్యా.పే.:** (అతడు వెళ్ళడం చూస్తూ, మూల్గుతాడు).... అమ్మా.......

(ఇంకేమీ చేయకండి – లేకపోతే ఏది మంచిదనిపిస్తుందో అది చేయండి)

**పెద్ద బృందంతో చర్చ**

- ఈ నాటికలో ఏమి జరిగింది?
- సువార్తను ఈవిధంగా పంచుకున్నవారెవరైనా మీకు తెలుసా? మీరు ఎప్పుడైనా ఇలాంటివారిని చూసారా?
- కాలం గడిచేకొద్దీ ఇలాంటి సువార్తసేవ ఎంతవరకు విజయవంతం అవుతుంది?
- యేసు పరిచర్య చేసిన విధానంతో పోల్చితే ఇలాంటి సువార్తీకరణ విధానం ఎలాంటిది?

బాధపడుతున్న వారిని గూర్చి దేవుడు శ్రద్ధ వహిస్తున్నాడని లేఖనం స్పష్టం చేస్తుంది. కాబట్టి మనం కూడా వారిపట్ల శ్రద్ధ తీసుకోవాలి. ప్రజలకోసం దేవుని హృదయాన్ని అర్థం చేసుకోవడానికి సహాయపడే శ్రేష్టమైన ''ఆధారాలు'' యేసు ఆజ్ఞల్లో మనం చూడవచ్చు.

## ప్రధానమైన ఆజ్ఞ

**చిన్నబృందంతో చర్చ**

***నిర్వాహకునికి సూచనలు***: *వాక్యభాగాలను బోర్డుపై రాయండి. వరుసలో ఉన్న వచనాలను చదివి, ప్రశ్నలకు జవాబులు ఇవ్వమని బృందాలకు చెప్పండి.*

ఈ కింది వచనాలు చదవండి. మనం చేయాలని ఆజ్ఞాపించిన రెండు విషయాలు ఏమిటి?

మత్తయి 22:36-40 లూకా 10:27

ఈ కింది వచనాలు చదవండి. పైనున్న రెండు విషయాలలో ఒక్కటి మాత్రమే ఈ వచనాలు పేర్కొంటున్నాయి. అది ఏమిటి?

మత్తయి 7:12 రోమా 13:9 గలతీ 5:14

**నివేదించే సమయం**

మొదటి వరుసలోని వచనాలలో మనం చూసే రెండు ఆజ్ఞలు ఏమిటి?

- *దేవుని ప్రేమించడం*
- *మన పొరుగువారిని ప్రేమించడం*

ఈరెండిరటిలో గొప్ప ఆజ్ఞ ఏదని యేసు చెప్పాడు? *(మత్తయి 22:37-38 మరలా చదవండి)*

- *దేవుని ప్రేమించడం*

ధర్మశాస్త్రం, ప్రవక్తలను క్రోడికరిస్తే, ప్రధానమైన ఒకేఒక్క ఆజ్ఞ ఏది?

- *నీ పొరుగువాని ప్రేమించడం*

ఈ ఆజ్ఞను ఉపయోగించి ధర్మశాస్త్రాన్ని, ప్రవక్తను క్రోడీకరించాలని యేసు ఎందుకు ఎంచుకున్నాడని మీరు భావిస్తున్నారు?

- *మనం చేసే పనులద్వారా దేవునిపట్ల మనకున్న ప్రేమను మనం చూపుతాం కాబట్టి అని వాళ్ళు చెప్పకపోతే అప్పుడు ఈ పాఠం చివరిలో ఈ ప్రశ్న దగ్గరకు మరలా రండి.*

## మన పొరుగువారిని ప్రేమించడం

**చిన్నబృందంతో చర్చ**

1యోహాను 3:17; 1యోహాను 4:20; యాకోబు 1:27 చదవండి.

- మన పొరుగువానిని ప్రేమించడం గూర్చి ఈ వచనాలు ఏమి బోధిస్తున్నాయి?

**పెద్దబృందంతో చర్చ**

దేవుని ప్రేమకు, ప్రజల అవసరాలకు మనం స్పందించడానికి మధ్య ఉన్న సంబంధం ఏమిటి?

- *మనం దేవుని ప్రేమిస్తే అది మనం ఇతరులను ప్రేమించడం ద్వారా బయల్పరచబడుతుంది. మనం దేవుని ప్రేమిస్తున్నామని చెప్పుకొని, మన పొరుగువారిని ప్రేమించకపోతే, మనం నిజంగా దేవుని ప్రేమించడం లేదని అది చూపుతుంది.*

ప్రజలకు వారి అవసరాలలో సహాయం చేయకుండా దేవుని ప్రేమను పంచుకోవడం సాధ్యమా?

- *సాధ్యం కాదు.*

ప్రజల ఆత్మీయ అవసరాలతో పాటు వారి సామాజిక, భౌతిక అవసరాలకు పరిచర్య చేయకపోతే, మనం యేసు శిష్యులమౌతామా?

- *లేదు. గొఱ్ఱెలు, మేకల ఉపమానాన్ని మనం చూస్తే, మనం ఏమి చేసామో, ఏమి చేయలేదో అనే దానితో స్పష్టంగా విభజించబడవచ్చు. ''నేను ఆకలిగొంటిని మీరు నాకు ఆహారమిచ్చారు. నేను దప్పిగొంటిని, మీరు నాకు దాహమిచ్చారు....'' (మత్తయి 25:35). మనం నిజంగా ఆయనను అనుసరించేవారమైతే, మన చుట్టూ ఉన్నవారి అవసరతలపట్ల శ్రద్ధ చూపాలని ఆయన ఆశిస్తున్నట్లు ఈ ఉపమానంలో యేసు స్పష్టంగా చెబుతున్నాడు.*

## సిలువ

***నిర్వాహకునికి సూచనలు***: *ఇక్కడ చూపించినట్లు బోర్డుపై సిలువను గీయండి. బృందానికి ఈ చిత్రాన్ని వివరించండి.*

ఈ సూత్రాన్ని జ్ఞాపకం ఉంచుకోవడానికి ఈ రేఖాచిత్రం మనకు సహాయం చేస్తుంది. నిలువుగా ఉన్న గీత దేవునితో మన సంబంధాన్ని సూచిస్తుంది. అది పెద్ద గీత.

సమాంతరంగా ఉన్న గీత ఇతరులతో మనకున్న సంబంధాన్ని సూచిస్తుంది. సమాంతరంగా ఉన్న గీత నిలువుగా ఉన్న గీతమీద ఆధారపడివుంది. నిలువుగా ఉన్న గీత లేకపోతే సమాంతరంగా ఉన్న గీత మట్టిలో పడివుంటుంది. ఇది ఈ చిత్రానికి మాత్రమే కాదుగాని మన జీవితాలలో కూడా నిజం. మంచి సంబంధాలు ఉండాలంటే దేవుని సహాయం మనకు కావాలి.




## నీ పొరుగువాడు ఎవరు?

***నిర్వాహకునికి సూచనలు***: *ఈ కార్యాచరణలో మీరు మంచి సమరయుని కథ చదువుతుండగా క్లాసులోనివారు దాన్ని నటించి చూపుతారు. క్లాసులో ప్రతి ఒక్కరిని కథలోని పాత్రలుగా నటించమని చెప్పండి. ఈ కథను చూపడానికి ఏడుగురు అవసరం అవుతారు. ఒక తల్లి, 2 దొంగలు, ఒక యాజకుడు, ఒక లేవీయుడు, ఒక సమరయుడు, ఒక సత్రం యజమాని.*

''నిత్య జీవానికి వారసుడ్ని కావలంటే నేనేం చెయ్యాలి?'' (అంటే ''నేను పరలోకం/మోక్షం వెళ్ళాలంటే ఏమి చేయాలి?'' అని అర్థం) అని ఒకరు యేసును అడిగారు. రెండు విషయాలు అవసరం అని యేసు చెప్పాడు – మనం దేవుని ప్రేమించాలి, పొరుగువారిని ప్రేమించాలి. అప్పుడు ''నా పొరుగువాడు ఎవరు?'' అని ఆ వ్యక్తి ప్రశ్నించాడు. యేసు ఈ కింది కథతో అతనికి జవాబు చెప్పాడు.

*లూకా 10:39–37 చదవండి.*

**పెద్ద బృందంతో చర్చ**

- మంచి సమరయునికి నేలపై పడివున్న వ్యక్తి తెలుసా?
- ఆ వ్యక్తిపట్ల మంచి సమరయుడు ఎలా స్పందించాడు? ఇతరుల ప్రవర్తనతో పోల్చితే అది భిన్నంగా ఎలా ఉంది?
- మంచి సమరయుడు తన పొరుగువానికి ఎలా ప్రేమను చూపాడు? తగినంత మాత్రమే చేసాడా, లేక అవసరమైనదానికంటే ఎక్కువగా చేసాడా?
- మన పొరుగువాడు ఎవరు అనే విషయాన్నిగూర్చి ఈ కథ ఏమి నేర్పిస్తుంది?

- మన పొరుగువానికి ప్రేమను చూపించడంగూర్చి ఈ కథ మనకు ఏమి నేర్పిస్తుంది?

## అన్వయం

మీరు తరచుగా చూచే ప్రజలనుగూర్చి ఆలోచించండి. వేరొకరికోసం మీరు ఏమి చేయగలరు?

# పాఠం 4: అన్ని విషయాలలో ఎదుగుట

**ముఖ్యమైన తలంపు**
యేసు శరీర, ఆత్మీయ, సామాజిక, మానసిక విషయాల్లో ఎదిగాడు. మనం కూడా ఈ నాలుగు విషయాల్లో ఎదిగినప్పుడు మన సమాజం, సంఘం కూడా అదేవిధంగా ఎదగడానికి సహాయం చేయగలం.

**వస్తువులు**

1. దృశ్య సహకారాలు
   ఎ. 'యేసు ఎదిగిన విషయాలు' చార్టు (ఒక్కొక్క విద్యార్థికి ఒక్కొక్కటి)
2. పోస్టర్ లేక వైట్ బోర్డు
3. పోస్టర్ లేక వైట్ బోర్డు మీద అంటించడానికి చిన్న చిన్న కాగితం ముక్కలు.
4. విద్యార్థి సహకారి కావాలంటే ఇవ్వవచ్చు (వి.స.)
   ఎ. లూకా 2:52 చార్టు

## పరిచయం

**చిన్న బృందంతో చర్చ**

- 0 నుండి 18 సంవత్సరాల వయస్సు మధ్య ఏ విషయాలలో బిడ్డ ఎదగాల్సివుంది?

***నిర్వాహకునికి సూచనలు***: *బృందం ఇచ్చిన జవాబులను చిన్న కాగితం ముక్కలమీద రాయండి (వీటిని మీరు తరువాత చేసే పనిలో వాడుతారు). నాలుగు విషయాల్లో వాళ్ళు ఏ ఉదాహరణనైనా మర్చిపోతే, వారికి ఒక ఉదాహరణ ఇచ్చి జ్ఞాపకం చేయడానికి చూడండి. ఉదాహరణ: సామాజిక విషయం: ఈ వ్యక్తికి కుటుంబం లేక ఎవరో ఒకరు ప్రేమించేవారు ఉండడం అవసరమని మీరు తలస్తున్నారా?*

## లూకా 2:52

లూకా 2:52 చదవండి: ''యేసు జ్ఞానమందును, వయస్సునందును, దేవుని దయయందును మనుషుల దయయందును వర్థిల్లుచుండెను.''

యేసు ఎదిగిన నాలుగు విధానాలు ఏమిటి? ఈ నాలుగు విధానాలుగా ఎదగడాన్ని ఏ నాలుగు పదాలు సూచిస్తాయి?

- జ్ఞానం — మానసికమైన
- వయస్సు — భౌతికమైన
- దేవుని దయ — ఆత్మీయమైన
- మనుషుల దయ — సామాజికమైన

***నిర్వాహకునికి సూచనలు***: *నాలుగు సాధారణమైన పదాలను ఒక పోస్టర్ లేక వైట్ బోర్డుపై రాయండి. పరిచయంలో తయారుచేసిన కాగితం ముక్కలను ఉపయోగించి, వాళ్ళు చెప్పిన ఆ విషయాలు ఈ విభాగాల్లో దేనికి సంబంధించినవో విభజించమనండి.*

యేసు వలెనే మనం కూడా ఈ నాలుగు విషయాల్లో వర్థిల్లాల్సివుంది. మనుషులు పెరిగే విధానాన్నిగూర్చి ఆలోచించడానికి యేసు ఎదుగుదలనుగూర్చిన మాదిరిని మనం ఉపయోగించవచ్చు.

## యేసు ఎదుగుట

**పెద్ద బృందంతో చర్చ**

1. యేసు ఎదిగిన పరిస్థితులలో భౌతిక/వస్తు/సామాజిక జీవన పరిస్థితులు ఏమిటి? (ఆయన యూనివర్సిటీలో చదివాడా? ఆయన ఇంటిలో విద్యుత్ ఉపకరణాలున్నాయా? ఆయనకు తగినంత ఆహారం ఉందా? ఆయనకు చదవడం, రాయడం వచ్చా? తన తల్లిదండ్రులను ఆయన ప్రేమించేవాడా?)
    - *యేసు ఒక పేద కుటుంబంలో పెరిగాడు. వాళ్ళు రెండు పావురాలను అర్పణగా ఇచ్చారు (లూకా 2:24; లేవీ 12:8 చూడండి).*
    - *అయితే ఆయనకు తగినంత ఆహారం ఉంది. ఆయన తండ్రికి ఒక ఉద్యోగం ఉంది, ప్రేమించే కుటుంబం ఉంది.*
    - *సమాజమందిరంలో చదవడం రాయడం కూడా ఆయన నేర్చుకున్నాడు.*
2. తనకోసమైన దేవుని ఉద్దేశాన్ని నెరవేర్చడానికి తగినన్ని వనరులు యేసుకు ఉన్నాయా? ఉంటే ఎందుకని, లేకపోతే ఎందుకని?
    - *దేవుడు తనకిచ్చిన పనిని తాను ముగించాడని యోహాను 17:4 తెలియజేస్తుంది. ఆయన తన ఉద్దేశాన్ని అందుకోగలిగాడు.*
3. దేవుని ఉద్దేశాలను సాధించడానికి ఎంత ఆస్తిపాస్తులు అవసరమౌతాయి?
    - *యేసు పేదవాడు, కాని దేవుడు తన జీవితంకోసం ఉద్దేశించినవి ఆయన సాధించగలిగాడు.*
4. యేసు నాలుగు విషయాలలో వర్ధిల్లాడు/ఎదిగాడు. ఇతరులు ఈ విషయాలలో ఎదుగునట్లు మనం సహాయం చేయగలమా? ఎలా?
    - *సహాయం చేయగలం, ఇతరులకు సహాయం చేయగలగడానికి ఈ నాలుగు విషయాలు ఒక మాదిరిగా మనకు ఉన్నాయి.*
    - *ఈ నాలుగు విషయాలలో ఎదగడం అనేది ఒక ప్రక్రియ, దానికి సమయం పడుతుంది.*
5. యేసు వెంటనే ఎదిగిపోయాడా/వర్ధిల్లాడా? లేక అది సమయంపట్టే ప్రక్రియా?
    - *యేసు ఎదుగుదల ఒక ప్రక్రియలా జరిగింది, సుమారు 30 సంవత్సరాలు పట్టింది!*
6. యేసు ఎదుగుదల అనేక సంవత్సరాలు జరిగిన ప్రక్రియ అయితే, ఇతరులు ఎదగడానికి ఎన్ని సంవత్సరాలు అవసరం? ప్రజలు అభివృద్ధి చెందడానికి మనం ఎంత కాలం వెచ్చించడానికి సిద్ధపడాలి?
    - *ప్రజలు ఎదగాలంటే సమయం పడుతుంది. వాళ్ళకు సహాయం చేయాలని మనం కోరుకుంటే, అనేక సంవత్సరాలు అనేక గంటలు వెచ్చించడానికి మనం ఇష్టపడాలి.*

## మన సొంత జీవితానికి అన్వయించుకోవడం

యేసు ఎదిగి/వర్ధిల్లినట్లుగా మనం కూడా వర్ధిల్లడమే కాకుండా ఈ నాలుగు విషయాలలో ప్రజలు ఎదిగేటట్లు మనం సహాయం చేయాలి కూడా.

***నిర్వాహకునికి సూచనలు***: *'యేసు ఎదిగిన విషయాలు' చార్టు కాపీ ప్రతి ఒక్కరికీ ఇవ్వండి* ***(దృశ్యపరికరాలు) (వి.స.)***

మొదటిగా, ఈ నాలుగు విషయాలలో ఎలా ఎదగవచ్చో ఉదాహరణలు ఇస్తూ వాటిని నింపి, మీ కుటుంబం, సంఘం, సమాజం ఈ విషయాలలో ఎదగడాన్ని ప్రోత్సహించండి.

గుర్తుంచుకోండి.....

- ఒక వారంలో చేయగలిగే విషయాలనే ఎంచుకోవడం. మీరు మరీ పెద్ద విషయాన్ని ఎంచుకుంటే, దాన్ని పూర్తిచేయడం కష్టమౌతుంది తద్వారా వచ్చిన ఫలితం నిరాశాజనకంగా ఉంటుంది. మీరు విజయం సాధించగలిగే ఒక చిన్న విషయాన్ని ఎంచుకుని, తరువాత వారం మరొక విషయాన్ని ఎంచుకోవచ్చు.
- మీరు ఇప్పటికే చేయని విషయాన్ని ఎంచుకోండి.

***తక్కువ విద్య ఉన్న బృందాలకు*** – *బృందానికి ఆ పట్టికను నింపడం కష్టంగా ఉంటే ఈ కింది విషయాలనుగూర్చి చర్చిస్తే సరిపోతుంది:*

- పైన చెప్పుకున్న నాలుగు విషయాలలో ఎదగడాన్నిగూర్చి ఆలోచించండి. మీరు ఇప్పటివరకూ చేయని విషయాలు ఏమిటి?
- మీ సొంత కుటుంబాన్నిగూర్చి ఆలోచించండి. వాళ్ళు నాలుగు విషయాలలోనూ ఎదుగుతున్నారా? ఈ విషయాలలో ఒకదానిలో మీ కుటుంబం లేక మీ కుటుంబంలోని ఒకరు ఎదగడానికి మీరు చేయగలిగే ఒక పని ఏమిటి?
- మీ సంఘాన్నిగూర్చి ఆలోచించండి –ఈ నాలుగు విషయాలలో ఎదగడానికి మీరు సహాయం చేయగలవారు ఎవరు? మీరు ఏమి చేయగలరు?

- మీ సమాజాన్నిగూర్చి ఆలోచించండి –ఈ నాలుగు విషయాలలో ఎదగడానికి మీరు సహాయం చేయగలవారు ఎవరు? మీరు ఏమి చేయగలరు?

యేసు ఎదిగిన ఈ నాలుగు విషయాలలో మీ కుటుంబం, సంఘం, సమాజం ఎదగడానికి సహాయం చేసే ఆలోచనలతో మిగిలిన పట్టికను నింపండి.

***నిర్వాహకునికి సూచనలు***: *విద్యార్థులు ఆలోచించడానికి సరిపోయేటంత సమయాన్ని ఇవ్వండి. వాళ్ళకు వెంటనే వచ్చే ఆలోచనలకంటే మంచి ఆలోచనలు రావడం చాలా ప్రాముఖ్యం.*

*వాళ్ళు పూర్తిచేసిన తర్వాత, వాళ్ళల్లో ఎవరైనైనా స్వచ్ఛందంగా క్లాసులోని వారితో తమ ఆలోచనలు పంచుకోమని చెప్పండి. ఏ గడుల్లోనైనా రాయడానికి ఉదాహరణలు దొరకడం కష్టంగా అనిపించిందేమో అడిగి బృందమంతా కలిసి వాటికి మంచి ఉదాహరణలు చెప్పగలరేమో చూడండి. (ప్రతి ఒక్కరూ చెప్పడానికి తగినంత సమయం లేకపోతే, ఇంటివద్దకు తీసుకెళ్ళి దానిగూర్చి ఆలోచించి పూర్తిచేయమని చెప్పండి.)*

| **నేపథ్యం** | **యేసు ఎదిగిన విషయాలు** | | | |
|---|---|---|---|---|
| **ఎదుగుదలకోసం** | **జ్ఞానం** | **భౌతికమైన** | **ఆత్మీయమైన** | **సామాజికమైన** |
|  **తనకోసం** | నేను మరింత తెలుసుకోవాలనుకున్న దాన్నిగూర్చి ఒక పుస్తకం లేక వ్యాసం చదవడం. | చాలా దూరం నడవడం. | ప్రార్థనలో గడపడానికి ఒక పూట ఒంటరిగా కేటాయించడం. | ఒక స్నేహితునికి ప్రోత్సాహకరమైన సందేశం పంపడం |
|  **కుటుంబం** | నా కుటుంబానికి రెండు సామెతలు అన్వయించడం గూర్చి చర్చ. | కుటుంబమంతా భోజనం చేసిన తర్వాత గిన్నెలు కడగడం. | నా కుటుంబాన్ని అనుదిన ధ్యానంలో నడపించడం. | (పిల్లలు లేకుండా) భార్య/భర్తను బయటికి తీసుకెళ్ళడం. |
|  **సంఘం** | ఆదివారపు సందేశాన్ని అన్వయించడానికి సోమవారం ధ్యానం చేయడం. | సంఘం ఎదుట ఉన్న దారిని బాగుచేయడం. | సంఘ కాపరి, పెద్దలకోసం ప్రతి రోజు ప్రార్థించడం. | టీ తాగడానికి వేర్వేరు సంఘ సభ్యులను ఇంటికి పిలవడం. |
|  **సమాజం** | ఒక సమాజ నాయకునితో సమాజంలోని సమస్యలను చర్చించడం. | ఇరుగుపొరుగు ప్రాంతాల్లో చెత్తను సేకరించడానికి తిరగడం. | మన ఇంటి దగ్గర జరిగే క్రిస్మస్ పండుగకు పొరుగువారిని ఆహ్వానించడం. | పొరుగువాళ్ళ పిల్లలతో ఫుట్‌బాల్ ఆడడం. |

## ముగింపు

**చిన్న బృందంతో చర్చ (ఇద్దరు లేక ముగ్గురు)**

మీరు చేయడానికి నిర్ణయించుకున్న ఒక్క విషయాన్నిగూర్చి ఇద్దరు లేక ముగ్గురు (ముగ్గురికంటే ఎక్కువమంది వద్దు) ఉన్న బృందాలతో చెప్పండి. మీ నిర్ణయం నెరవేర్చుటకు కావలసిన సామర్థ్యాన్ని దేవుడు ఇచ్చునట్లు ఒకరికోసం ఒకరు ప్రార్థించుకోండి.

# పాఠం 5: సంఘం సహాయం చేయాలని దేవుడు కోరుతున్నాడు

**ముఖ్యమైన తలంపు**
తమ సమాజానికి క్రియలద్వారా తమ ప్రేమను చూపించడానికి సంఘం పిలువబడిరది. ముఖ్యంగా పేదల అవసరాలను తీర్చడానికి.

**వస్తువులు**

1. కాగితం – నలుగురున్న బృందానికి రెండు ముక్కలు
2. దృశ్య పరికరాలు
    ఎ. సహాయం చేసే విధానాలు చార్టు – ఒక్కొక్క బృందానికి ఒక్కొక్కటి
3. విద్యార్థి సహకారి కావలంటే ఇవ్వవచ్చు (వి.స.)
    ఎ. సహాయం చేసే విధానాలు చార్టు

## పరిచయం

**చిన్న బృందంతో చర్చ (నలుగురు)**
మీ సంఘం చేసే కార్యక్రమాలన్నీ ఒక జాబితా రాయండి (కావాలంటే ప్రతి కార్యక్రమం సూచించే చిత్ర గీయండి).

***నిర్వాహకునికి సూచనలు***: *పూర్తిచేసిన తర్వాత, ఆ కార్యక్రమం సంఘానికి వచ్చేవారికా లేక సంఘానికి హాజరు కానివారికోసమా అని జాబితా చూచి బృందాలను చెప్పమనండి. ఒక్కొక్కరికి ఎన్ని ఉన్నాయి? పేదవారు, అవసరతలో ఉన్నవారికోసం తయారు చేసిన కార్యక్రమాలను భిన్నంగా గుర్తించండి. అవి ఎన్ని?*

**పెద్దబృందంతో చర్చ**

1. సంఘాన్నిగూర్చి సమాజంలో ఉన్నవారు ఏమనుకుంటున్నారు?
2. సంఘం చేసే పనినిగూర్చి సమాజంలోనివారు ఏమనుకుంటున్నారు?
3. క్రైస్తవులనుగూర్చి సమాజంలోనివారి ఏమనుకుంటున్నారు?
4. సమాజంలో ఉన్నవారు సంఘానికి రావాలనుకుంటున్నారా లేక మీరు వెళ్ళి వారిని ఆహ్వానించాలా?
5. ఇకపై సంఘం అక్కడ ఉండదు అని అంటే సమాజంలోని ప్రజలు ఏమని భావిస్తారని మీరు అనుకుంటున్నారు?
6. ఇది దేవుని సంతోషపరస్తుందని మీకనిపిస్తుందా?

## యెషయా 58

దేవుడు ఎన్నుకున్న ప్రజలైన ఇశ్రాయేలీయులకు యెషయా రాస్తున్నాడు. వాళ్ళు నేటి సంఘానికి సూచనగా ఉన్నారు.

యెషయా 58:1–10 చదివి చర్చించండి:

- ప్రజలు ఏమి చేస్తున్నారు?
- ఈ ప్రజలకు దేవుడు ఎలా స్పందిస్తున్నాడు?
- దేవుడు ఈ విధంగా ఎందుకు స్పందించాడు?

**చిన్నబృందంతో చర్చ (నలుగురు లేక ఐదుగురు)**
ఒక చిత్రం గీసి గాని లేక ఒక వాక్యం రాసిగాని ఈ వాక్యభాగపు సారాంశాన్ని రాయమని ప్రతి బృందానికి చెప్పండి.
ప్రతి బృందం తమ చిత్రం లేక వాక్యం చూపిన తర్వాత, నేటి సంఘానికి ఈ ఆలోచనలు ఎలాంటి భావాన్నిస్తున్నాయని వాళ్ళు భావిస్తున్నారో అడగండి.

# ఉప్పు, వెలుగు

**చిన్న లేక పెద్దబృందంతో చర్చ**

మత్తయి 5:13 చదవండి.

- ఉప్పుతో ఉన్న కొన్ని ఉపయోగాలు ఏమిటి?
    - *శుభ్రం చేస్తుంది, వస్తువులు పాడవ్వకుండా కాపాడుతుంది, రుచినిస్తుంది.*
- క్రైస్తవులు "లోకానికి ఉప్పయి ఉన్నారు" అని యేసు ఎందుకు అన్నాడు?
    - *మనం నివసిస్తున్న ప్రాంతాలపై మనం మంచి ప్రభావం చూపించాలి. మన శుద్ధిచేసే ప్రభావాన్ని చూపుతూ మన సమాజం పాడవ్వకుండా కాపాడాలి. అంటే మన సమాజాలు మరింతగా దేవుడు ఉద్దేశించినట్లుగా మారేటట్లు చూడడం అన్నమాట.*
    - *కొంచెం ఉప్పు ఆహారపు రుచిని మార్చివేసినట్లుగానే, కొద్దిమంది క్రైస్తవులు సమాజంలో గొప్ప ప్రభావాన్ని చూపగలరు.*

మత్తయి 5:4–16 చదవండి

- మనం మరింత ప్రకాశవంతంగా వెలగాలంటే ఎలా?
    - *సత్క్రియలు చేయడం ద్వారా.*
- సత్క్రియలు చేయడంవల్ల వచ్చే ఫలితం ఏమిటి?
    - *మన పరలోకపు తండ్రి మహిమపరచబడతాడు.*

# ఉప్పు, వెలుగు కథలు

**పెద్దబృందంతో చర్చ**

కథ 1 చదవండి – హిందూ స్త్రీలకు చీరలు

ఈ సంఘంలో ఉన్న సంఘసభ్యులు తమను తాము అణచివేయబడుతున్న ఒక మతపు అల్పసంఖ్యాకులు అని భావించేవారు. క్రైస్తవ సమాజం వెలుపల పరిచర్య చేయడానికి వాళ్ళు భయపడేవారు. సమాజం అంతటికీ క్రీస్తుప్రేమను చూపించాలని వాళ్ళు నేర్చుకున్న తర్వాత, తరువాతి వారానికల్లా సమాజంలో ఉన్న అవసరతలను విచారణ చేసి తెలుసుకోమని పాస్టరు వారిని ప్రోత్సహించాడు.

తరువాత వారం ఆరాధనలో, ఒక్కటే చీర కలిగివున్న 12మంది హిందూ స్త్రీలను తాము కనుగొన్నామని వారు నివేదిక ఇచ్చారు. ఆ వేడి వాతావరణంలో ప్రతిరోజు చీరలు ఉతుక్కోవాలి. ఒక స్త్రీకి ఒక్కటే చీర ఉంటే, ఆ చీర ఉతికిన తర్వాత ఎండలో ఆరేవరకు ఆమె ఇంటిలోనే ఉండిపోవాలి. సంఘంలో 3 చీరలు కలిగి, ఒక చీరను ఆ హిందూ స్త్రీలకు ఇవ్వడానికి సిద్ధపడ్డవారు ఎవరైనా ఉన్నారా అని పాస్టరు అడిగాడు. అవసరమైనన్ని చీరలు ఇవ్వడానికి తగినంతమంది స్త్రీలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చాఉఉ. తరువాత వారం, ఒకే ఒక్క చీర ఉన్న ఆ హిందూ స్త్రీల గృహాలను ఈ సంఘంలోని స్త్రీలు దర్శించి, రెండవ చీరను వారికి ఇవ్వజూపారు. దీనికి ఆ హిందూ స్త్రీలు ఎంతగా ప్రభావితులయ్యారంటే వారు ఈ క్రైస్తవ స్త్రీలను తమకోసం ప్రార్థించమని అడిగారు. కొందరు గర్భిణీలైన హిందూ స్త్రీలు తమకు పుట్టబోయే బిడ్డలకోసం ప్రార్థించమని కూడా క్రైస్తవ స్త్రీలను అడిగారు.

కథ 2 చదవండి – సమాజంకోసం నీళ్ళు

ఒక ప్రాంతంలో ప్రజలు చాలా తీవ్రమైన నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారు. తమ సమాజానికి సహాయం చేయాలని దేవుడు తన సంఘాన్ని కోరుతున్నాడని తెలుసుకున్న తర్వాత, నీటి అవసరాన్ని తీర్చడానికి తాము ఏమి చేయగలమో పరిశోధించడానికి సంఘ నాయకత్వం నిర్ణయించుకుంది. చేతితో బావులు తవ్వడానికి ఉపయోగించే పరికరాలను అద్దెకు ఇచ్చే ఒక ప్రదేశంగూర్చి వాళ్ళు తెలుసుకున్నారు. మొదటిగా ప్రజలు ఆ ఆలోచనను తిరస్కరించారు. ఎందుకంటే నీళ్ళు చాలా లోతుగా ఉన్నాని వాళ్ళు భావించారు. చేతితోనే బావులను తవ్వడం సాధ్యమైతే, ఇంతకుముందే ఎందుకు తవ్వి ఉండకపోదురు? అయితే సంఘ నాయకత్వం ప్రయత్నించి చూడడానికి నిర్ణయించారు. ఒక్కొక్క మీటరు చొప్పున కిందికి దిగే స్టీల్ సిలిండర్ ఉన్న సామగ్రిని అద్దెకు తెచ్చారు. సంఘానికి వెనుక ఉన్న స్థలంలోనికి దాన్ని తీసుకువెళ్ళి తవ్వడం మొదలుపెట్టారు. 45 అడుగుల్లోనే నీళ్ళు తగిలేసరికి అందరూ సంతోషించారు.

సంఘానికి రాని సభ్యులకు మాత్రం అది సంతోషంగా లేదు. సంఘంలోని వాళ్ళు ఆ నీళ్ళను తాము మాత్రమే వాడుకుంటారు అని వాళ్ళు భావించారు. కాని సంఘం సమాజంలోని వారిని తమకు దేవుడు ఇచ్చిన ఆశీర్వాదాలతో వచ్చి ఆ బావిని పంచుకోవడానికి ఆహ్వానించారు.

చుట్టుపక్కల ఉన్న గ్రామీణ సమాజాలలోని వాళ్ళు సంఘ నాయకులను తమ ప్రాంతంలో కూడా బావులు తవ్వడానికి సహాయం చేస్తారేమోనని కోరడం ఆరంభించారు. సంఘం అనుకూలంగా స్పందించింది. ఒక్క సంవత్సరంకంటే ఎక్కువ కాలంలోనే 15 బావులు చేతులతో తవ్వారు – అందులో ఒకటి 80 అడుగులకంటే లోతు!

సంఘం దేవుని ప్రేమను చూపిన విధానానికి ప్రజలు ఎంతో ప్రభావితులయ్యారు. దేవుని ప్రేమనుగూర్చిన సందేశాన్ని వినడానికి సమాజంలోనివారిని సంఘపువారు ఆహ్వానించినప్పుడు, తమకు నీళ్ళు ఇచ్చిన ప్రజల దేవునిగూర్చి, ఆయన ప్రేమనుగూర్చి వినడానికి ఆసక్తితో వచ్చిన ప్రజలతో సంఘం నిండిపోయింది.

**పెద్దబృందంతో చర్చ**

- ఈ సంఘాలు ఏమి చేసాయి?
- అవి ఐశ్వర్యవంతమైన సంఘాలా?
- వాళ్ళు ఏ వనరులను వాడారు?
- వాళ్ళు ఇలాంటివి ఎందుకు చేసారు?
- వారు చేసిన పనివల్ల వచ్చిన ప్రభావం ఏమిటి?

## గొఱ్ఱెలు–మేకలు – మత్తయి 25:31–46

**పెద్దబృందంతో చర్చ**

***నిర్వాహకునికి సూచనలు**: ఈ వాక్యభాగం నొక్కి చెప్పేది భౌతిక విషయాలనుగూర్చి అని విద్యార్థులు అర్థం చేసుకోవడానికి సహాయం చేయండి. "నేను ఆకలిగొంటిని మీరు నాకు కరపత్రిక ఇచ్చారు" అని గాని లేక "నేను రోగినైయుంటిని మీరు నాకు మంచి ప్రసంగాలు వినేందుకు పంపారు" అని యేసు వారికి చెప్పడం లేదు. భౌతికమైన అవసరాలకు భౌతికమైన పరిష్కారాలు ఇందులో ఉన్నాయి.*

మత్తయి 25:31–46 చదవండి.

1. గొఱ్ఱెలకు మేకలకు ఉన్న వ్యత్యాసం ఏమిటి?
2. గొఱ్ఱెలు చేసిన కొన్ని పనులు ఏమిటి? అవి ఆధ్యాత్మికమైనవా లేక భౌతికమైనవా?
3. యేసు పేర్కొన్న పనులను మీ సంఘం ఎంత తరచుగా చేస్తున్నది?
4. ఇలాంటివన్నీ మీ సంఘ సభ్యులందరూ చేస్తే, అతి సమాజంతో ఎలాంటి ప్రభావం చూపుతుంది?
    - *వాళ్ళకు సంఘంపై మంచి అనుకూలమైన ప్రభావం కలుగుతుంది.*
    - *వాళ్ళ జీవితాలు మెరుగౌతాయి.*
    - *దేవునిగూర్చి నేర్చుకోవడానికి వాళ్ళు మరింత ఆసక్తి చూపుతారు.*

## ఇతరులకు సహాయం చేసే మార్గాలు

**చిన్నబృందంతో చేసు కార్యక్రమం (వి.స.)**

***నిర్వాహకునికి సూచనలు:*** **దృశ్య సహకారుల**నుండి 'సహాయం చేసే మార్గాలు' అనే చార్టు నకలును ప్రతి చిన్నబృందానికి ఇవ్వండి. ఆకలి, దాహం, వస్త్రహీనత, నిరాశ్రయం, రోగం, చెరసాలలో ఉండడం అనే పరిస్థితులలో సంఘం ప్రజలకు ఎలా సహాయపడగలతో కొన్ని నిర్దిష్టమైన ఆలోచనలను చేయండి. 'సహాయం చేసే మార్గాలు' అనే చార్టు వాడి, దాన్ని నింపడానికి కలసి పనిచేయండి.

| **పరిస్థితి** | **సంఘం సహాయం చేయగల మార్గాలు** |
|---|---|
|  **ఆకలి** | |
|  **దాహం** | |

| | |
|---|---|
| వస్త్రహీనత  | |
| నిరాశ్రయం  | |
| రోగి  | |
| చెరసాల  | |

# పాఠం 6: మనం సహాయం చేయగల కొన్ని అవసరాలు

**ముఖ్యమైన తలంపు**
మన సమాజాలలో ఉన్న అన్నిరకాల సమస్యలను మనం తీర్చాలని దేవుడు కోరుతున్నాడు. మన సమాజంపట్ల ఆయనకు మంచి ఉద్దేశాలున్నాయి.

**వస్తువులు**

1. విద్యార్థి సహకారి ఇవ్వవచ్చు (వి.స.)
    - ఎ. పాస్టర్. వాంగ్, ప్రశ్నలు
    - బి. జోన్, మేరియాల సందర్భ పరిశీలన

**పాస్టర్ వాంగ్ దర్శనం**

---

**పెద్దబృందంతో చర్చ** (వి.స.)
***నిర్వాహకునికి సూచనలు***: మీరు ఒక కథ చెప్పబోతున్నారని క్లాసులో చెప్పండి. విన్నతర్వాత వాళుÊళ ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు చెప్పాలి.

- పాస్టర్ వాంగ్ కమ్యూనిటీలో వారు కనుగొన్న కొన్ని సమస్యలు ఏమిటి?
- ఈ సమాజంకోసం దేవుని ఉద్దేశం ఏమిటి? ప్రతి సమస్యను పరీక్షించి, యేసు ఏ పరిష్కారాన్ని చూపాడో గమనించండి.
- పాస్టర్ వాంగ్ ఏమి చేయాలని యేసు చెప్పాడు?

**పాస్టర్ వాంగ్ కథ చదవండి.**

ఒక పెద్ద పట్టణంలోని పేద మురికి వాడలో ఉన్న ఒక చిన్న సంఘానికి పాస్టర్ ఒకాయన ఉండేవాడు. అతని పేరు వాంగ్. తనను దేవుడు పంపించాడని భావించిన వాంగ్ ఈ మధ్యనే ఆ సమాజంలోకి వచ్చాడు. ఆ సంఘం చిన్నది –సుమారు 40మంది ఉండేవారు. వారిలో అధికశాతం స్త్రీలు, పిల్లలు. వాంగ్‌కు రెండు ఉద్యోగాలు. తన చిన్న మందకు కాపరిగా ఉండడానికి చేయగలిగింది చేసేవాడు. అలాగే తన భార్య, ఇద్దరు చిన్నబిడ్డలను పోషించగానికి మరొక ఉద్యోగం చేసేవాడు.

ఒకరోజు వాంగ్ తన అలవాటు ప్రకారం తెల్లవారడానికి ఒక గంట ముందు లేచి దేవునితో తన వ్యక్తిగత సమయాన్ని గడపుతున్నాడు. అతడు లేచి, బట్టలు వేసుకొని తనకున్న ఒక్కగదిలో తన భార్యాపిల్లలు నిద్రపోతుండగా వారి నిద్రకు భంగం కలగకుండా నిశ్శబ్దంగా ఆ గదిలోని పరదా తీసికొని అవతలిపక్కకు వెళ్ళాడు. తన కిరోసిన్ దీపం వెలిగించుకొన్నాడు. తన బైబిల్ చదవడం మొదలుపెట్టాడు. ఆ ఉదయం, అతడు యెషయా గ్రంథం 58 వ అధ్యాయం చదువుతున్నాడు. తనకు ఎలాంటి ఆరాధన కావాలి అనే దేవుని ఆక్రందన వింటున్నాడు:

దుర్మార్గులు కట్టిన కట్లు విప్పుటయు కాడిమాను మోకులు తీయుటయు బాధింపబడినవారిని విడిపించుటయు ప్రతి కాడిని విరుగగొట్టుటయు నేనేర్పరచుకొనిన ఉపవాసము కదా? నీ ఆహారము ఆకలిగొనినవారికి పెట్టుటయు నీ రక్త సంబంధికి ముఖము తప్పింపకుండుటయు దిక్కుమాలిన బీదలను నీ యింట చేర్చుకొనుటయు వస్త్రహీనుడు నీకు కనబడినప్పుడు వానికి వస్త్రములిచ్చుటయు ఇదియే గదా నాకిష్టమైన ఉపవాసము?

వాంగ్ ఇక ముందుకు చదవలేకపోయాడు. అతని హృదయం అతని మనస్సుతో పోరాటం చేసింది. దేవుడు పేదవారిపట్ల అంత శ్రద్ధ చూపినప్పుడు వాంగ్ పేదరికం మధ్య, తన హృదయాన్ని బద్దలుచేసే వేదనమధ్య ఎందుకు జీవిస్తున్నాడు? తన సమాజంలోని ప్రజలు బ్రతకడానికి ఎన్ని తిప్పలు పడుతున్నారో అతనికి తెలుసు. వాళ్ళు నిజంగా నలిగిపోతున్నారు. వాంగ్‌కే తన కుటుంబాన్ని పోషించడానికి తగినంత లేక ఇబ్బందిపడుతున్నాడు. తరచూ తమకు కావలసిన ఔషధాలు కొనడానికి డబ్బు ఉండడం లేదు. అతడు అనుకున్నాడు, ‘‘దేవుడెక్కడ ఉన్నాడు? ఈ వాక్యం ఈ అవసరాలతో ఉన్న ఈ సమాజానికి ఎలా సరిపోలుతుంది?’’

అతడు ఈ ఆలోచనలతో సతమతమౌతుండగా, ఎవరో మెల్లగా తలుపు తట్టినట్టు వినిపించింది. ''ఇంత పొద్దున్నే, ఎవరై ఉండవచ్చు'' అని వాంగ్ అనుకున్నాడు. అతడు తలుపు దగ్గరకు వెళ్ళి ''ఎవరు?'' అని అడిగాడు. బయటనుండి ఒక స్వరం, ''వాంగ్, నేను యేసును'' అని వినబడిరది. ''ఎవరూ?'' వాంగ్ రెట్టించాడు. ''నేను యేసును, వాంగ్'' అని జవాబు వచ్చింది. ''నిజం చెప్పు నీవెవరు?'' అని అడిగాడు వాంగ్. ''వాంగ్, నేను యేసును. నీ హృదయ వేదన విన్నాను కాబట్టి నేను వచ్చాను. నిన్ను బాధిస్తున్నదేమిటో నాకు చూపించు'' అని ఆ స్వరం వినిపించింది.

ఆ స్వరం నిజాయితీగా అనిపించింది. వాంగ్ జాగ్రత్తగా గెడ తీసి తలుపు తెరిచాడు. బయట ఇంకా చీకటిగానే ఉంది. వాంగ్‌కు ఒక రేఖాచిత్రంలా మాత్రమే కనిపించింది కాని యేసు ఎలా ఉంటాడని తాను ఊహించాడో ఆ రూపం అలానే ఉంది. ''ప్రభువా, లోపలికి రండి'' అని వాంగ్ అన్నాడు. ''లేదు వాంగ్, మీ సమాజంలోకి నీవు నన్ను తీసుకువెళ్ళి, నీ హృదయాన్ని బాధించేది నాకు చూపించాలని నేను కోరుతున్నాను.'' ఇంకా ఆశ్చర్యంనుండి తేరుకోకుండానే వాంగ్ అంగీకరించాడు. ''కాని మనం చాలా జాగ్రత్తగా నడవాలి. వర్షం చాలా ఎక్కువగా ఉంది. చాలా చెత్త ఉంది. మాకు లెట్రిన్‌లు ఎక్కువలేవు కూడా'' అని వాంగ్ హెచ్చరించాడు.

వారు ఆ పేటలోని వీధుల్లో నడుస్తుండగా, వాళ్ళు దాటి వెళ్తున్న ఇళ్ళ కథలను వాంగ్ యేసుకు చెప్పాడు. ఈ ఇంటిలో ఉన్న ఆమె తన పిల్లల పోషణకోసం తన్ను తాను అమ్ముకుంటుంది. తరువాత గుడిసెలో తాగినప్పుడల్లా, అంటే చాలా తరచుగా తన భార్యను పిల్లలను కొట్టే తాగుబోతు ఉన్నాడు. అటుపక్కన ఈ పేట ప్రెసిడెంట్ ఇల్లు. అతడు చాలా మోసగాడు. పేటకు కరెంటు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసి, ఆ డబ్బుతో తాగి, జూదం ఆడి ఖర్చుపెట్టేసాడు.

వారు ఆ పేట మధ్యలోని ఒక బహిరంగ స్థలాన్ని దాటి వెళ్ళారు. అది ఆ ప్రాంతానికి పార్కులా ఉండాల్సింది కాని దుర్గంధంతో కూడిన చెత్తతో, పరుగులెత్తుతున్న ఎలుకలతో నిండిపోయింది. ''ఆ ఇల్లు చూసారా?'' అని కొండపక్కనే ఉన్న ఒక గుడిసెను చూపిస్తూ వాంగ్ అడిగాడు. ''ఒకావిడ, నలుగురు పిల్లలు అక్కడ ఉంటారు. పైకప్పు కారిపోతూ ఉంటుంది. వాళ్ళు చాలా పేదవారు. వాళ్ళు తినడానికి, ధరించడానికి చాలా కొంచెం ఉంటుంది. ఎప్పుడు చూసినా రోగాలతోనే ఉంటారు.'' అంతలోపు వాళ్ళిద్దరూ ఆ పేట ఉన్న కొండ చివరికి వచ్చేసారు. వాంగ్ దూరంగా చూపిస్తూ, ''అదుగో అక్కడనుండి ఈ స్త్రీలు, పిల్లలు నీళ్ళకోసం నడిచివెళ్ళి తెచ్చుకుంటారు. ఈ ప్రాంతంలో నీళ్ళు దొరకవు'' అని చెప్పాడు.

వాంగ్ ఆ మూల మలుపు తిరగబోతుండగా, అతనికి సన్నగా ఏడుస్తున్న శబ్దం వినిపించింది. ఆ శబ్దం వచ్చినవైపు అతడు చూసాడు. అక్కడ ఏడుస్తున్నది యేసు! తన హృదయాన్ని బాధించిన విషయాలే యేసు హృదయాన్ని కూడా బాధించాయని వాంగ్‌కు అర్థమైంది. వాంగ్ మాట్లాడబోయాడు కాని యేసు తన చేతిని వాంగ్ చుట్టూ వేసి, అతనివైపు చూసి, ''వాంగ్, ఈ సమాజాన్నిగూర్చి నా ఉద్దేశాలు ఏమిటో నీకు చూపించాలని అనుకుంటున్నాను'' అన్నాడు.

హఠాత్తుగా, తాను ఆ సమాజాన్ని చూస్తున్నట్లు వాంగ్ కనుగొన్నాడు. యేసు మాట్లాడడం మొదలు పెట్టాడు, ఆయన వర్ణిస్తున్న విషయాలు జరుగుతూ ఉండడం వాంగ్ చూడగలిగాడు! వాంగ్ చర్చిలో ఉన్న పేదవారినిగూర్చి యేసు మాట్లాడుతున్నాడు. వాళ్ళు ఎంత పేదవారైనా తమకున్నదాన్ని తమకంటే పేదవారుగా ఉన్న పొరుగువారితో పంచుకుంటున్నారు. ప్రతిరోజు వాళ్ళు కొంచెం బియ్యం మిగిల్చి, దాన్ని ఒక గిన్నెలో వేసేవారు. వారాంతంలో వాళ్ళందరూ ఆ గిన్నె నిండుగా బియ్యం తీసుకువచ్చి యేసు నామంలో వాళ్ళకంటే తక్కువ కలిగిన సమాజంలోని వారికి అవి పంచిపెట్టేవారు. అలాగే సబ్బులు. సంఘంలోని స్త్రీలు సమాజంలో ఉన్న విధవరాండ్రను దర్శించి వారిని ''దత్తత'' తీసుకుని వారికి బట్టలు ఉతకడం, వంట చేయడం, వాళ్ళ పిల్లలు అనారోగ్యంతో ఉన్నపుడు వాళ్ళను చూసుకుంటూ వారికి సహాయం చేసారు.

యేసు ఉద్యోగాలనుగూర్చి మాట్లాడాడు. వారికి పనివుండడం వాంగ్ చూడగలిగాడు. ఎక్కువ జీతం వచ్చేవి కాకపోయినా, గౌరవప్రదమైన పనులు, వారి జీవనోపాధికి అవసరమైనవి ఇచ్చే ఉద్యోగాలు. యేసు ఇళ్ళనుగూర్చి చెప్పగా, వర్షం కారిపోతూ, చలిని ఆపలేకపోయిన గుడిసెలను ఇళ్ళుగా మారడం వాంగ్ చూసాడు. మరీ గొప్ప ఇళ్ళు కాదుగాని శుభ్రంగా, సురక్షితంగా ఉండే ఇళ్ళు. యేసు నీళ్ళగూర్చి మాట్లాడుతుండగా, హఠాత్తుగా అక్కడ కొన్ని ముఖ్యమైన కూడళ్ళలో కుళాయిలు కనబడి, స్త్రీలు, పిల్లలు పరిశుభ్రమైన నీళ్ళను పట్టడం కనిపించింది. యేసు శుభ్రతనుగూర్చి మాట్లాడాడు. వాంగ్‌కు అక్కడ ఇంటికొకటి కాదుగాని వాళ్ళందరూ వాడుకోవడానికి సరిపడినన్ని లెట్రిన్‌లు కనిపించాయి. పేట మధ్యలో ఉన్న చెత్తకుప్ప మాయమైపోయింది. దానిస్థానంలో చిన్న చెట్లు, అక్కడ పిల్లలు కేరింతలు కొడుతూ, బంతిని తన్నుతూ నవ్వుతూ కనిపించారు. రూపాంతరం పొందిన జీవితానుగూర్చి యేసు మాట్లాడాడు. తన శరీరాన్ని అమ్ముకుని జీవిస్తున్న ఆమె ఒక గౌరవప్రదమైన ఉద్యోగం చేసుకుంటూ తన పిల్లలను పోషిస్తుండడం వాంగ్ చూచాడు. త్రాగుబోతు మారిపోయి ప్రేమగల భర్తగా, తండ్రిగా అయ్యాడు. ప్రెసిడెంటు డబ్బుల్ని అన్యాయంగా వాడడం మాని నిజంగా సమాజానికి సహాయం చేస్తున్నాడు.

అప్పుడు యేసు, ‘‘వాంగ్, సంఘాన్ని చూడు!’’ అని చెప్పాడు. వాంగ్ చూసేసరికి, సంఘమంతా నిండిపోయివుంది. అక్కడ పురుషులు ఉన్నారు! ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. దేవుని మంచితనానికై వాళ్ళు ఆయనను స్తుతిస్తున్నారు. అదుగో, వాంగ్ వాక్యం చెబుతూ, బోధిస్తూ, ఆత్మలో ప్రజలను నడిపిస్తూ, విధేయతతో కూడిన ప్రేమగల కార్యాలు చేయడానికి వారిని నడిపిస్తున్నాడు. ‘‘వాంగ్, ఈ దర్శనం నీ సమాజంలోని ప్రజలపట్ల నా ఉద్దేశం. నీవు ఈ దర్శనాన్ని ప్రజలతో పంచుకుని, వారిని అలా నడిపించడం ఆరంభించు’’ అని యేసు వివరించాడు.

‘‘కాని, ప్రభువా, మేము చాలా పేదవాళ్ళం!’’ అని వాంగ్ చెప్పడం మొదలుపెట్టాడు. ‘‘వాంగ్, ఇశ్రాయేలీయులను ఎఱ్ఱ సముద్రంగుండా నడిపించింది ఎవరు? ఐదు రొట్టెలు, రెండు చేపలను ఐదువేలమంది పురుషులు, ఇంకా స్త్రీలు పిల్లలకు సరిపోయేటట్లుగా ఇచ్చింది ఎవరు? మూడు సంవత్సరాలపాటు కరవులో సారెపతు విధవరాలిని ఆమె కుటుంబాన్ని పోషించడానికి కొంచెం నూనెను, పిండిని సమృద్ధిగా చేసిందెవరు? గలిలయలో సముద్రాన్ని నిమ్మళింపజేసింది ఎవరు?’’ అని యేసు నెమ్మదిగా అడిగాడు. ‘‘అది నీవే ప్రభువా’’ అని వాంగ్ జవాబిచ్చాడు. ‘‘అలా అయితే, వాంగ్, నిన్ను చేయమన్నది చేయడానికి నీవు విధేయత చూపించు. నీకున్నది కొంచెమే, అయినా దాన్ని ఇతరులతో పంచుకో. నీ ప్రజలకోసం నాకున్న ఆత్మీయమైన, భౌతికమైన ఉద్దేశాలను ప్రకటించు. నేను నీ దేశాన్ని స్వస్థపరస్తాను!’’ వాంగ్‌కు కోడి కూసిన శబ్దం వినిపించింది. కర్టెన్ వెనుక నిద్రపోతున్న అతని భార్య దగ్గి మరోవైపుకు తిరిగింది. అతడు టేబుల్ ముందు కూర్చున్నాడు, కాని తన ముందున్న దీపం ఆరిపోయివుంది. తెల్లవారింది. యేసు ఎక్కడున్నాడో అని వాంగ్ చుట్టూ చూసాడు. కాని ఆయన కనబడలేదు. ‘‘నేను కలగన్నానా? అది దర్శనమా?’’ అని అతడు ఆశ్చర్యపోయాడు. అర్థం కాలేదు. కాని తాను యేసును కలిసానని, పేదలకోసం దేవుని శ్రద్ధనుగూర్చి కొత్త అవగాహన కలిగింది. తన సమాజంలోని ప్రజలకు దేవుని ప్రేమను చూపించడానికి ఎలా నడిపించాలో ఒక తాజా దర్శనం అతనికి కలిగింది.

**చిన్నబృందంతో చర్చ**

***నిర్వాహకునికి సూచనలు***: *క్లాసులోనివారిని చిన్నబృందాలుగా విభజించండి. ప్రశ్నలు మళ్ళీ చెప్పి, కలసి వాటికి జవాబులు చర్చించమని చెప్పండి. (వి.స.)*

- పాస్టర్ వాంగ్ సమాజంలో ఉన్న కొన్ని సమస్యలు ఏమిటి?
- ఈ సమాజంకోసం దేవుని ఉద్దేశం ఏమిటి? ఒక్కొక్క సమస్యను పరిశీలించి, దానికి యేసు చూపిన పరిష్కారం ఏమిటని యేసు చూపాడో గమనించండి.
- పాస్టర్ వాంగ్ ఏమి చేయాలని యేసు చెప్పాడు?

**నివేదించే సమయం**

*పాస్టర్ వాంగ్ కథనుండి, మీరు చర్చించిన ప్రశ్నలనుండి ఏమి నేర్చుకున్నారు?*

- *భౌతికంగా, ఆత్మీయంగా తన సమాజంపట్ల దేవునికి మంచి ఉద్దేశాలున్నాయి.*
- *సమాజంకోసం తనకున్న మంచి ఉద్దేశాలను ప్రకటించాలని యేసు పాస్టర్ వాంగ్‌కు చెప్పాడు.*
- *మనం పేదలుగా ఉండడం దేవునికి సమస్య కాదు. మనం కేవలం ఆయనకు విధేయులవ్వాలి.*
- *మనం ఆయన మార్గాలను అనుసరిస్తే దేవుడు మన దేశాన్ని స్వస్థపరస్తాడు.*

## బైబిల్ అధ్యయనం

**పెద్దబృందంతో చర్చ**

యిర్మియా 29:11 చదవండి

- మనకోసం దేవుని ప్రణాళికలు ఎలాంటివి? (*సమాధానకరమైనవి, మనకు హానిచేసేవి కావు, మనం జీవించునట్లు మనకు నిరీక్షణనిచ్చేవి (అంటే భవిష్యత్తును ఇచ్చేవి)*)

పాస్టర్ వాంగ్ సమాజంలో వ్యభిచారం, త్రాగుడు, దూషణ, అవినీతి, తీవ్రమైన పేదరికం ఉన్నాయి. శుభ్రమైన నీళ్ళు, ఆహారం లేకుండా ప్రజలు అనారోగ్యంతో కూడిన వాతావరణంలో నివసించారు. కాని ఆ సమాజం అలా ఉండాలని దేవుడు కోరుకోలేదు. **మన సమాజాలకోసం దేవునికి మంచి ఉద్దేశాలున్నాయి.**

2దినవృత్తాంతాలు 7:14 చదవండి.

- తన ప్రజలు ఏమి చేయాలని దేవుడు ఆశిస్తున్నాడు? (*తమను తాము తగ్గించుకోవాలని, ప్రార్థించి తనను వెదకాలను, తమ పాపాలను ఒప్పుకొని విడిచిపెట్టాలని*)
- మనం అలా చేస్తే దేవుడు ఎలా స్పందిస్తాడు? (*ఆయన మన ప్రార్థనలు వింటాడు, మన పాపాలు క్షమిస్తాడు, మన దేశాన్ని స్వస్థపరస్తాడు.*)

మనం దేవునికి విధేయులంగా జీవించడం ఆరంభిస్తే మార్పులు చూడగలం. సమాజంలో మనం చూసే అవసరాలను పరిష్కరించడంద్వారా దేవుని మంచి ఉద్దేశాలను వారికి ప్రకటించే బాధ్యత సంఘంగా మనపై ఉంది. మనం ఆయన మార్గాలను అనుసరిస్తే, దేవుడు మన దేశాన్ని స్వస్థపరస్తాడు.

## జోస్, మరియల సందర్భ పరిశీలన

**పెద్దబృందంతో చర్చ (వి.స.)**
***నిర్వాహకునికి సూచనలు***: *ప్రతి ప్రశ్నకు కొనÊఇన మాదిరి ఉదాహరణలు ఇటాలిక్స్ (వంగివున్న అక్షరాలతో) ఇచ్చాం. ఇవి మాత్రమే మంచి జవాబులు కావని, కొన్ని మంచి జవాబులని గుర్తుంచుకోండి సుమా!*

జోస్, మరియల సమాజం కూడా మీరున్న సమాజం లాంటిదే అని ఊహించండి.

| |
|---|
| జోస్, మరియల ఇల్లు ఇప్పుడే కాలిపోయింది. అసలేమీ మిగల్లేదు, అంతా బూడిదైపోయింది. నిన్న, వాళ్ళు తమ ఐదుగురు పిల్లలతో బంధువుల ఇంట్లో ఉన్నారు. అయితే చాలా చిన్నదైన ఆ ఇంట్లో అప్పటికే 10మంది ఉంటున్నారు. కాబట్టి మరో ఏడుగురికి ఆ ఇంట్లో చోటు లేదు. జోస్ ఒక రైతు. అతడు తన చిన్న పొలంలో విత్తనాలు వేయడం అప్పటికే పూర్తిచేసాడు. కాని పంట కోయడానికి మరో మూడు నెలల సమయం ఉంది. తనదగ్గరున్న డబ్బంతా పొలంలో విత్తనాలు వేయడానికి ఖర్చుపెట్టేసాడు. తనకు మిగిలినదంతా మంటల్లో కాలిపోయింది. |

ఈ కుటుంబానికి ఉన్న కొన్ని అవసరాలు ఏమిటి?

- *ఆహారం*
- *ఆశ్రయం*
- *బట్టలు*
- *వంటచేసుకునే పాత్రలు, సరకులు*
- *వాళ్ళ ఇల్లు మరలా కట్టుకుంటుండగా తలదాచుకునేందుకు ఒక చోటు*

సహాయంకోసం సమాజంలో అందుబాటులో ఉన్నవి ఏమిటి?

- ప్రజలు
  - *కొత్త ఇల్లు కట్టడంలో సహాయం చేయడానికి పని చేసేవారు*
  - *స్వచ్ఛందంగా ఇల్లు కడుతున్నవారికి ఆహారం సిద్ధం చేయడంలో సహాయం చేసేవారు.*
  - *పిల్లను చూచుకోవడానికి సహాయం చేసేవారు.*
  - *కుటుంబాన్ని ఆదరించి, సహకారులుగా ఉండేవారు*
  - *కాలిపోయిన ఇల్లున్న స్థలాన్ని శుభ్రం చేయడానికి సహాయం చేసేవారు*
  - *అత్యవసర సహాయం అందించగల ప్రభుత్వ అధికారులు*
- వస్తువులు
  - *అదనంగా ఉన్న వంటపాత్రలు, గిన్నెలు*
  - *ఆహారం*
  - *బట్టలు*
  - *దుప్పట్లు*
- వసతులు
  - *ఉండడానికి ఒక చోటు*

# మన సమాజం

**చిన్నబృందంతో చర్చ**

సాధ్యమైతే, బృందాలను తమ సమాజాలలో 10నుండి 20 నిమిషాలు తిరిగి రమ్మని, వాళ్ళ సమాజంలోని ముఖ్యమైన కొన్ని సమస్యలను చూచి, ఈ కింది ప్రశ్నలకు జవాబులు ఇమ్మని చెప్పండి:

1. మీ సమాజంలో ఉన్న కొన్ని సమస్యలు ఏమిటి?
2. ఆ పరిస్థితుల్లో దేవుని ఉద్దేశాలు ఏమిటని మీరు అనుకుంటున్నారు?

**పెద్దబృందంతో చర్చ**

***నిర్వాహకునికి సూచనలు***: *బృందాలు గుర్తించిన సమస్యలలోనుండి ముఖ్యమైన మూడు ఎంచుకోవడానికి సీడ్ ఓటింగ్ చేయండి.*

***సీడ్ ఓటింగ్ సూచనలు:***

*ప్రతి వ్యక్తికి 10 "సీడ్స్" (ఇవి టూత్ పిక్స్, ఆకులు, చిన్న రాళ్ళు మొ॥నవి ఏవైనా చిన్న వస్తువులు) ఇచ్చి, ముఖ్యమైనవి అనుకున్న సమస్యలకు, ఎక్కువ సంఖ్యలో వాటిని ఇవ్వమని చెప్పండి. ప్రతి సమస్య దగ్గర పెట్టిన వస్తువులను లెక్క పెట్టండి. ఎక్కువ సంఖ్యలో సీడ్స్ దేనిదగ్గర ఉంటాయో అది అన్నిటికంటే ముఖ్యమైన సమస్య. దానికంటే తక్కువ సంఖ్యలో సీడ్స్ ఉన్నది రెండవ ముఖ్యమైన సమస్య, దానికంటే తక్కువసంఖ్యలో ఉన్న మూడవ ముఖ్యమైన సమస్య.*

- మీ సంఘం ఏమి చేయాలని దేవుడు చెబుతున్నాడు?

మీరు గుర్తించిన మూడు సమస్యలను తీసుకోండి. దానిలో ప్రతి దానివిషయంలో సహాయం చేయగలిగేవి మీ సమాజంలో ఏమి ఉన్నాయో మాట్లాడుకోండి. ఆ సమస్యను పరిష్కరించడానికి సహాయపడే వనరులు – ప్రజలు, వస్తువులు, నిధులు, సౌకర్యాలు ఏమి అందుబాటులో ఉన్నాయో చర్చించండి.

మీరు చర్చించుకున్న దానివిషయమై ఏమి చేయాలో అనేది కలసి ప్రార్థించండి.

# పాఠం 7: దేవుని రాజ్యపు లెక్కలు

**ముఖ్యమైన తలంపు**
నిరుపేదలు కూడా ఇవ్వగలరు. వాళ్ళలా ఇచ్చినప్పుడు, వారి ప్రయత్నాలను దేవుడు ఆశ్చర్యకరమైన విధానాలలో వర్ధిల్లజేయడం వారు చూడగలరు.

**వస్తువులు**

1. దృశ్య సహకారులు:
    - ఎ. సెట్ 1: యెషయా 40:29 సూచనలు (5పేజీలు/ఒక సెట్ మాత్రమే)
    - బి. సెట్ 2: ఐదు రొట్టెలు, రెండు చేపల కవర్లు (ప్రతి బృందానికి ఒక్కొక్క కవరు)
    - సి. సెట్ 3: ఏలియా, విధవరాలు కవర్లు (ప్రతి బృందానికి ఒక్కొక్క కవరు)
    - డి. సెట్ 4: విధవరాలు ఆమె రెండు కాసులు కవర్లు (ప్రతి బృందానికి ఒక్కొక్క కవరు)
    - ఇ. సెట్ 5: తలాంతుల ఉపమానం కవర్లు (ప్రతి బృందానికి ఒక్కొక్క కవరు)

***నిర్వాహకునికి సూచనలు***: *ఈ పాఠంలో మీరు బైబిల్లోని ఐదు కథలను చెప్పి, దృశ్య సహకారులను ఉపయోగించి కథలోనుండి ''లెక్కల సూత్రం'' తయారుచేయమని విద్యార్థులను అడగాలి. బృందానికి లెక్కలు చేయడం తక్కువగా తెలిస్తే, ఇవ్వడానికి ముందు, ఇచ్చిన తర్వాత వారివద్ద ఉన్నవి ఏమిటి? అని వివరించే కార్డులను మాత్రమే వాడండి. చిత్రాలను –ముందు, తర్వాత – అనే రెండు వరుసల్లో పేర్చమనండి. ''ఈ రెండు వరసలమధ్య ఉన్న తేడా ఏమిటి? మొదటి వరుసనుండి రెండవ వరుసకు వాళ్ళు ఎలా వెళ్ళారు?'' అని వారిని అడగండి. జవాబు– 'దేవుడు'. అవి దేవుడే వృద్ధిచేసాడు అనే అవగాహన వారికి కలిగేటట్లు చేయండి.*

## పరిచయం: యెషయా 40:29

బైబిల్లో లెక్కల సూత్రాలున్నాయిన మీరు గమనించారా? ఈ పాఠంలో బైబిల్లో ఉన్న కొన్ని లెక్కలు మనం చూడబోతున్నాం.

**పెద్దబృందంతో చేసేది**
యెషయా 40:29 చదవండి. ఈ పాఠానికి ఇది మూల వచనం అని వివరించండి.

- బలమైనవారు ఎవరు? బలహీనులు ఎవరు?
- దేవుడు మనకోసం ఏమి చేస్తాడు?
- ఈ వచనాన్ని మనం లెక్కల సూత్రంలో వాడవచ్చా? ప్రయత్నిద్దాం....

***నిర్వాహకునికి సూచనలు***: *మీది పెద్ద బృందమైతే, ఐదుగురిని ముందుకు రమ్మని వారిలో ప్రతివారికి ఒక్కొక్క మాటను లేక లెక్కల్లో వాడే గుర్తులు ఇవ్వండి (**దృశ్య సహకారులు** : కార్డుల సెట్ 1). చిన్నబృందం అయితే కార్డులన్నీ నేలమీద పెట్టి, వాటిని సరియైన వరుసలో పెట్టడానికి కలిసి పనిచేయండి.*

''మన బలహీనత x దేవుడు = బలం''

- ఈ వచనంనుండి – నేర్చుకోగలిగే ''సూత్రం'' ఏమిటి?
    - *వృద్ధిచేసేవాడు దేవుడే!*
    - *మన బలహీనత కాదుగాని దేవుని బలమే ప్రాముఖ్యమైనది.*

## 'ఒక చిన్నవాడు – వాని భోజనం': యోహాను 6:1–14

***నిర్వాహకునికి సూచనలు***: *ఈ పాఠంలోని కథలన్నింటినీ సృజనాత్మక విధానంలో చెప్పడానికి సిద్ధపడండి.*

ఒకానొక సమయంలో ఒక చిన్నపిల్లవాడు ఉండేవాడు. ఒక ప్రసిద్ధి చెందిన బోధకుడు గలిలయ సముద్రం దగ్గరకు వస్తున్నాడని వాడు విని, ఆయన మాటలు వినడానికి వెళ్ళాలనుకున్నాడు. అతడు తన తల్లిని అడిగాడు, కాని ఆమె, ''వద్దు. అది చాలా దూరప్రదేశం. భోజనం సిద్ధంగా ఉంది తిని పడుకో'' అంది. ''నేను తినను. నన్ను పంపిస్తానంటేనే తింటాను'' అని వాడు మారాం చేయడం మొదలుపెట్టాడు. చివరి తల్లి ఒప్పుకుంది. వాడికి చిన్న బాక్సులో భోజనం కట్టి ఇవ్వగా, వాడు దాన్ని తీసుకుని సంతోషంగా బయలుదేరాడు.

చివరికి వాడు ఆ చోటికి చేరేసరికి, అప్పటికే ఆ ప్రదేశం ప్రజలతో కిటకిటలాడుతోంది. ప్రతి చిన్నపిల్లవాడిలాగానే వాడు జనాలను తోసుకుంటూ ముందుకు దూరిపోయాడు. చివరిగా బోధకుడు, ఆయన అనుచరుల మాటలు స్పష్టంగా వినబడేచోటికి వెళ్ళి ఒక చోటు చూసుకున్నాడు. ఆ బోధకుడు చెప్పే మాటలు, ఆయన చెప్పిన విధానం ఆ పిల్లవాడిని మంత్రముగ్ధుణ్ణి చేసాయి. తాను భోజనం తెచ్చుకున్నానని, అది తినాలనే సంగతే మర్చిపోయాడు.

చివరికి వానికి ఆకలివేసి, అమ్మ తనకోసం కట్టిన బాక్సు జ్ఞాపకం వచ్చింది. తనను ఎవరూ గమనించకుండా చూసుకుంటూ, నెమ్మదిగా ఆ బాక్సు తీసుకున్నాడు.

హఠాత్తుగా, బోధకుడు చెప్పడం ఆపి, అందరికీ భోజనం పెట్టమని తన శిష్యులకు చెప్పాడు. ఆ చిన్నవాడు చుట్టూ చూసి, సమూహంలో 5,000మంది పురుషులు, ఇంకా చాలామంది స్త్రీలు, పిల్లలు ఉన్నారని గ్రహించాడు. ''బాబోయ్, ఇంతమందికి భోజనం పెట్టడానికి వీళ్ళేం చేస్తారో?'' అని ఆశ్చర్యపోయాడు. వాడికా ఆలోచన వచ్చినట్లే, ఆ శిష్యులకు కూడా వచ్చినట్లుంది. వారిలో ఒకడు, ఇంతమందికి భోజనం పెట్టాలంటే ఎంతో ఖర్చవుతుంది కదా అని బోధకుడ్ని అడగడం విన్నాడు. ఆరునెలల జీతం ఖర్చుపెడితేగాని వాళ్ళందరికీ భోజనం పెట్టలేమని ఒక శిష్యుడు ఆయనకు చెప్పాడు.

''మీ దగ్గర ఏమున్నాయి?'' అని బోధకుడు వాళ్లను అడిగాడు. ఈ చిన్నపిల్లవాడు తన భోజనం తీసుకోవడం ఒక శిష్యుడు చూచాడు. అతనిపేరు అంద్రెయ. ''బోధకుడా, ఇదిగో, ఈ చిన్నపిల్లవాడి దగ్గర 1,2,3,4,5, ఐదు రొట్టెలున్నాయి, రెండు చేపలున్నాయి'' అని బోధకునితో చెప్పాడు. ''వాటిని నా దగ్గరకు తీసుకురండి'' అని బోధకుడు అన్నాడు.

తరువాత ఏమి జరిగిందో ఊహించగలరా?

''బోధకునికి నీ బోజనం కావాలంట'' అని అంద్రెయ ఆ చిన్నవాడితో అన్నాడు. ఆ చిన్నవాడు ఇష్టంగా తన భోజనాన్ని తీసుకొని అంద్రెయతోపాటు బోధకుడి దగ్గరకు వెళ్ళి ఆయనకు ఇచ్చాడు.

బోధకుడు ఆ పిల్లవాని దగ్గర్నుండి భోజనం తీసికొని, దేవునికి కృతజ్ఞతలు చెప్పి, ఆ ఆహారాన్ని పంచమని శిష్యులకు ఇచ్చాడు. ఆయన శిష్యులు తన కొంచెం ఆహారాన్ని అందరికీ పంచడం చూసిన పిల్లవాడు ఆశ్చర్యపోయాడు. అందరూ తినడం మొదలుపెట్టి, కడుపునిండేదాకా తిన్నారు. ఆ తరువాత బోధకుడు చెప్పగా మిగిలిన రొట్టె ముక్కలను 12 బుట్టల్లో నిండుగా పోగుచేసారు.

చిన్నవాడు ఇంటికి ఎప్పుడెప్పుడు వెళ్ళి అమ్మతో చెబుదామా అని ఆత్రపడ్డాడు. అమ్మ తనకు కట్టిన భోజనంతో 5,000మంది పురుషులు, స్త్రీలు, పిల్లలు కడుపునిండా తిన్నారని ఎంతో ఉత్సుకతతో తన తల్లికి చెప్పాడు. ''నాయనా, ఇలాంటి కల్లబొల్లి కబుర్లు చెప్పవద్దని నేను ఎన్నిసార్లు నీతో చెప్పాను?'' అని వాళ్ళ అమ్మ చిరాకుపడిరది!

- ఈ కథను మనం ఒక సూత్రంగా ఎలా మలచవచ్చు?

**చిన్నబృందంతో చేసేది (ముగ్గురు లేక నలుగురితో)**
***నిర్వాహకునికి సూచనలు***: *''చిన్నవాడు – అతని భోజనం'' అనే పేరుతో ఉన్న కవర్ ప్రతి బృందానికి ఇవ్వండి (***దృశ్య సహాకారులు*** కార్డు సెట్ 2) లేక పెద్ద పెద్ద గుర్తులు చేసి, ఒక సూత్రాన్ని తయారు చేయమని బృందానికి చెప్పండి. జవాబులు కనుగొనడానికి సహాయం చేసేలా వారికి సూచనలు ఇవ్వండి. ఒకసారి కలసి లెక్కల సూత్రాన్ని బృందం తయారు చేసిన తర్వాత, మిగిలినది వాళ్ళు తమ చిన్నబృందాలలో చేయవచ్చును.*

**జవాబు**: ''చిన్నవాడు + 5 రొట్టెలు + 2 చేపలు x దేవుడు = 5,000మంది పురుషులు + స్త్రీలు + పిల్లలకు కడుపునిండా భోజనం + 12 గంపలు''

చూడండి, ఇదీ దేవుని రాజ్యపు లెక్క అంటే!

**పెద్దబృందంతో చర్చ**

- యేసుకు ఆ చిన్నవాడు, వాడు తెచ్చుకున్న ఆహారం అవసరమా? ఆ ప్రజలకు ఆహారం పెట్టడానికి ఆయనకు వేరు విధానం కూడా ఉండిఉండవచ్చా?
- ఆ చిన్నవాడి భోజనం తీసుకోవడానికి యేసు ఎందుకు ఎన్నుకున్నాడు?

ఈ ప్రశ్నలను మనం తలపోస్తుండగా, దేవుని రాజ్యపు లెక్కలు చేయడం ఇంకా కొనసాగిద్దాం.

## ''విధవరాలు – ఆమె చివరి భోజనం'': 1రాజులు 17:7–16; 18:1

ఇశ్రాయేలు చరిత్రలో చాలా గడ్డు సమయం అది. మూడున్నర సంవత్సరాలుగా దేశంలో తీవ్రమైన కరవు పట్టిపీడిస్తుంది. ప్రజలు చచ్చిపోతున్నారు. దేవుని ప్రవక్త, ఏలియా కూడా చాలా ఇబ్బందిపడుతున్నాడు.

కాని ఏలియాను పోషించడానికి దేవుడు ఒక విధవరాలిని వాడుకున్నాడు. ఏలియా ఆ ఊరి దగ్గరలో నడుస్తుండగా, ఒక స్త్రీ పుల్లలు ఏరుకోవడం చూసాడు. ఆమె దగ్గరకు వెళ్ళి, ''తాగడానికి గిన్నెతో కొంచెం నీళ్ళు ఇవ్వమ్మా'' అని అడగమని దేవుడు ఏలియాకు చెప్పాడు. ఆమె నీళ్ళు తీసుకురావడానికి ఒప్పుకొని, వెళ్ళబోయింది. కాని ఆమె వెళ్ళేలోపునే, ఆమె, ఆమె కుమారుడు తినే ముందు తాను తినడానికి ఒక రొట్టెను తీసుకురమ్మని అడిగాడు.

''యెహోవా జీవముతోడు, నాకు, నా కుమారునికి తినడానికి ఒక్కొక్క రొట్టె చేసుకునేందుకే కొంచెం పిండి నూనె ఉన్నాయి. తర్వాత మేము కూడా చచ్చిపోవడమే'' అని ఆ స్త్రీ జవాబిచ్చింది. దానికి, ''ఏమీ భయపడవద్దు. ముందు నాకొక రొట్టె తీసుకురా. దేవుడే పోషిస్తాడు'' అని ఏలియా జవాబిచ్చాడు.

ఆ స్త్రీ వెళ్ళి తనవద్ద ఉన్న కొంచెం పిండి, నూనెతో ఏలియాకు ఒక రొట్టె చేసింది. ఆమెకు ఆశ్చర్యం కలిగించేటట్లు, కుండలో పిండి, గిన్నెలో నూనె ఇంకా ఉన్నాయి. ఆమె అందులోనుండి తీస్తున్నకొద్దీ, పిండి, నూనె వస్తూనే ఉన్నాయి. ''అయ్యా, నేను ఎంత వాడినా ఇంకా పిండి, నూనె వస్తూనే ఉన్నాయి. దేవునికే స్తోత్రం!'' అని ఆమె ఏలియాకు చెప్పింది.

ఏలియాకు, ఆ స్త్రీకి, ఆ స్త్రీ కుటుంబానికి ఆ రోజు మాత్రమే కాక, మరొక మూడు సంవత్సరాలు అందరూ తినేటంతగా దేవుడు వారికి అనుగ్రహించాడని బైబిల్ చెబుతుంది. ఎంత అద్భుతం!

- ఈ కథను ఒక సూత్రంగా మనం ఎలా మార్చగలం?

**చిన్నబృందంతో చేసేది**

***నిర్వాహకునికి సూచనలు***: *కవర్లు పంచిపెట్టండి (**దృశ్య సహకారులు** కార్డు సెట్ 3). ప్రతి బృందం ఒక సూత్రాన్ని తయారు చేయడానికి ప్రయత్నించనివ్వండి.*

తక్కువగా చదువుకున్న వారితో చేయించడానికి, ఈ కింది మాటలు లేక గుర్తులు ఉంచండి:

- *విధవరాలు*
- *1 రొట్టె*
- *ముగ్గురికి మూడు సంవత్సరాలకు సరిపోయే భోజనం*

**జవాబు**: ''విధవరాలు + 1రొట్టె x దేవుడు = 1రొట్టె + విధవరాలు, బాలుడు, ఏలియా x 365రోజులు I 3 సంవత్సరాలు = 3,285 రొట్టెలు''

ఇదీ దేవుని రాజ్యపు లెక్క అంటే!

**పెద్దబృందంతో చర్చ**

- ఆ స్త్రీ పేదరాలా?
- దేవుడు ఏలియాను వేరేవిధంగా పోషించగలిగేవాడా?
- ఆ పేద విధవరాలి దగ్గరకు వెళ్ళి తనను పోషించమని అడగాలని దేవుడు ఏలియాకు ఎందుకు చెప్పాడు?
- రొట్టెలు, చేపల కథలో, తనకోసం మాత్రమే ఉన్న ఆహారాన్ని ఇవ్వమని దేవుడు ఆ చిన్నవానిని ఎందుకు అడిగాడు?
- పేదలపట్ల, విధవరాండ్రపట్ల దేవునికి ప్రత్యేకంగా హృదయంలో స్థానం ఉందా?

## 'విధవరాలు – ఆమె రెండు కాసులు': మార్కు 12:41–44

ఒకరోజు యేసు దేవాలయంలో కానుకపెట్టె ఉన్నచోట కూర్చునివున్నాడు. ధనవంతులు తాము అర్పణలు ఇస్తుండగా అందరూ చూడాలని ప్రయత్నం చేయడం ఆయన చూసాడు. ఒక పేద విధవరాలివద్ద రెండు చిన్న నాణేలు మాత్రమే ఉన్నాయి. ఆమె దగ్గరున్నదంతా అదే కాబట్టి, ఇతరులు తాను కానుక వేయడం చూడకూడదన్నట్లు ఆమె సిగ్గుపడిరది. కాబట్టి ఆమె తన అర్పణను, ఎవరూ చూడకూడదు అన్నట్లుగా నిశ్శబ్దంగా వేసింది.యేసు తన శిష్యులను సమకూర్చి, ''ఇతరులంతా ఇచ్చినదానికంటే ఎక్కువగా ఈ స్త్రీ ఇచ్చింది'' అని వారితో చెప్పాడు.

**పెద్దబృందంతో చర్చ**

- యేసు మాటలకు అర్థం ఏమిటి? ఆమె ఎలా అందరికంటే ఎక్కువ ఇచ్చినట్లు?
- ''అమ్మా, దేవాలయం అవసరాలకంటే ఆ రెండు కాసులు నీకే చాలా అవసరం కాబట్టి వాటిని అర్పించవద్దు'' అని యేసు ఆమెకు ఎందుకు చెప్పాలేదు. ఆయన అలా చెప్పివుండవచ్చు కాని చెప్పలేదు. ఎందుకని?

ఆమెను ఆపడం మాని ఆమె చేసిన త్యాగాన్ని యేసు ప్రత్యేకంగా గమనించాడు. అప్పటినుండి ఆమె ఇచ్చింది అనేకమంది చదివేటట్లు రాయబడిరది. ఇతరులతో పోల్చితే ఆమె ఇచ్చింది చాలా ఎక్కువే! నిజంగానే ఆమె ఎక్కువ ఇచ్చింది. 2,000 సంవత్సరాలుగా క్రైస్తవులు ఆమెద్వారా ప్రేరేపణ పొందారు. ఆమె మాదిరినిబట్టి ఎంత ఇవ్వబడిరదో తలపోయండి. ఇది అన్నిటికంటే ఎక్కువ వృద్ధి! ఆమె తనదగ్గర ఉన్నది ఇచ్చింది, దేవుడు దాన్ని అభివృద్ధి చేసాడు. అదీ దేవుని రాజ్యపు లెక్క అంటే!

**చిన్నబృందంతో చేసేది**
***దృశ్య సహకారులను*** ఉపయోగించి ఒక లెక్కల సూత్రం తయారు చేయడానికి ప్రయత్నించండి.

**జవాబు**: ''విధవరాలు + 2కాసులు x దేవుడు = 2,000 సంవత్సరాలకు పైగా ప్రేరేపణ!''

*క్లాసులో ఈ విషయాలు జ్ఞాపకం చేయండి:*

- *ఒక చిన్నవాడు తన భోజనాన్ని ఇచ్చివేయమని దేవుడు చెప్పాడు....*
- *తన చివరి భోజనంలోనుండి ఏలియాకు మొదటిగా భోజనం పెట్టమని ఆయన ఒక విధవరాలికి చెప్పాడు....*
- *ఈ విధవరాలు తన దగ్గర ఉన్నదంతా ఇవ్వడానికి ఆయన అనుమతించాడు....*

**పెద్దబృందంతో చర్చ**

- పేదలు ఇవ్వనక్కరలేదని యేసు చెప్పాడా?
- దేవునికి ఇవ్వడానికి ''మరీ తక్కువ'' లేక ''అసలు లెక్కలోనికి రానిది'' ఏదైనా ఉందా?
- పేదలు ఇచ్చినదాన్ని దేవుడు ఆశీర్వదించాడా?
- మనం ఇచ్చేదాన్ని దేవుడు ఆశీర్వదించే కొన్ని విధానాలు ఏవి?
    - *భౌతిక ఆశీర్వాదాలు*
    - *ఇతరుల జీవితాలు మారడం చూడగలగడం*

- *సమాజం మెరుగుపడడం*
- *మనుషులు రక్షణపొందడం*

కొన్నిసార్లు మనం భౌతిక ఆశీర్వాదాలను అనుభవించినా, అన్నిసార్లు అది జరగకపోవచ్చు. కొన్నిసార్లు మన సమాజంలో ఒక ఆశీర్వాదపు మార్పును తెచ్చేదానిలో భాగంగా ఉండేటట్లు దేవుడు మనలను అనుమతిస్తాడు, లేకపోతే ఎవరొకరు క్రీస్తువద్దకు రావడం చూచేటట్లు చేస్తాడు. ఇతర సమయాలలో ఆయన మనలను భౌతికంగా ఆశీర్వదిస్తాడు. దేవుడు మనలను ఆశీర్వదించడానికి కారణం 1కొరింథీ 9:11లో మనకు జ్ఞాపకం చేస్తాడు –మనం ప్రతి సందర్భంలో దాతృత్వంగలిగి ఇవ్వడంద్వారా దేవుడు మహిమపరచునట్లు.

చివరి కథ. ఇది సంతోషంగా ముగిసేది కాదు....

## 'తలాంతుల ఉపమానం': మత్తయి 25:14–30

ఒకసారి ఒక ధనవంతుడు సుదూర ప్రయాణం వెళ్తున్నాడు. వెళ్ళడానికి ముందు, అతడు తన ముగ్గురు సేవకులను పిలిచాడు. మొదటివానికి ఐదు తలాంతులు ఇచ్చి (తలాంతు అంటే చాలా పెద్దమొత్తంలో సొమ్ము), ''నేను తిరిగివచ్చేవరకు దీనితో వ్యాపారం చెయ్యి'' అని చెప్పాడు. రెండవవానికి ఆయన రెండు తలాంతులు ఇచ్చి, ''నేను తిరిగివచ్చేవరకు దీనితో వ్యాపారం చెయ్యి'' అని చెప్పాడు. చివరిగా మూడవవాడికి ఆయన ఒక తలాంతు ఇచ్చి, ''నేను తిరిగివచ్చేవరకు దీనితో వ్యాపారం చెయ్యి'' అని అదే మాటను చెప్పాడు.

ఆ ధనవంతుడు వెళ్ళిపోయి, సుదీర్ఘకాలం తర్వాత తిరిగివచ్చాడు. అతడు తన ముగ్గురు సేవకులను మరలా పిలిచి, తాను లేనప్పుడు వాళ్ళు ఎలా పనిచేసారో అని అడిగాడు. మొదటి సేవకుడు యజమాని తనకిచ్చిన ఐదు తలాంతులను ఉపయోగించి మరొక ఐదు తలాంతులు సంపాదించానని నివేదించాడు. దానికి ఆ ధనవంతుడు, ''శభాష్! నీవు కొద్దిలో నమ్మకంగా ఉన్నావు, ఇప్పుడు మరింత ఎక్కువగా పొందుకో'' అని జవాబిచ్చాడు.

రెండవ సేవకుడు వచ్చి, మరొక రెండు తలాంతులు తాను సంపాదించానని నివేదించాడు. దానికి మరలా ఆ ధనవంతుడు, ''శభాష్! నీవు కొద్దిలో నమ్మకంగా ఉన్నావు, ఇప్పుడు మరింత ఎక్కువగా పొందుకో'' అని చెప్పాడు.

చివరిగా మూడవ సేవకుడు వచ్చాడు, ''నీవు చాలా కఠినమైనవాడవని నాకు తెలుసు. నీవు నాకిచ్చిన డబ్బు పోగొట్టేస్తానేమో అని భయపడ్డాను కాబట్టి దాన్ని భూమిలో పాతిపెట్టాను. అది నష్టం కాలేదు, ఇదిగో'' అని చెప్పాడు. దానికి ఆ ధనవంతుడు, ''సోమరివైన చెడ్డదాసుడా!'' అని కోపపడ్డాడు. అతడు ఆ తలాంతు తీసికొని మొదటి సేవకునికి ఇచ్చి, వీడ్ని రాజ్యములోనుండి వెలుపలికి త్రోసివేసాడు.

ఇదికూడా దేవుని రాజ్యపు లెక్కే. చూద్దాం రండి.....

**చిన్నబృందంతో చేసేది**
***నిర్వాహకునికి సూచనలు***: *కవర్లు పంచిపెట్టండి (**దృశ్యసహకారులు** కార్డు సెట్ 5). ప్రతి బృందం ఒక సూత్రం తయారు చేయడానికి అవకాశం ఇవ్వండి.*

**జవాబు:** ''సేవకుడు + 1తలాంతు x 0 (ఏమీ చేయకపోవడం) = 0 వృద్ధి + సేవకుడు చీకటిలోకి త్రోసివేయబడడం''

**పెద్దబృందంతో చర్చ**
- అందరికంటే తక్కువ ఎవరికి వచ్చింది? కాని ఏమి జరిగిందో చూడండి!
- దేవుడు పేదవారిపట్ల శ్రద్ధ చూపడా? అయితే అతన్ని రాజ్యంలోనుండి ఎందుకు త్రోసివేసాడు?
- పేదవారైనాసరే, యేసుకు వాళ్ళు విధేయులు కాకపోతే, పరిణామం ఎలా ఉంటుంది?

## ముగింపు

**చిన్నబృందంతో చర్చ**
1. దేవుడు మనకిచ్చినదానితో మనం దాతృత్వం చూపుతున్నామా?

2. దేవుడు మన సంఘానికి ఇచ్చినదానితో మన సంఘం దాతృత్వం కలిగివుంటుందా లేక మనకోసమే మనం దాన్ని వాడుకుంటున్నామా?
3. మనం దాతృత్వం కలిగివుంటే దేవుడు మనలను ఏ విధానాల్లో ఆశీర్వదించడం చూచాం?
4. నా జీవితంలో, సంఘంలో ఈ సూత్రాలను అన్వయించుకోవడానికి నేను ఏ మార్పులు చేసుకోవాల్సివుంది?

# పాఠం 8: ప్రేమగల కార్యాలు

**ముఖ్యమైన తలంపు**
ప్రేమగల కార్యాలద్వారా మనం మన సమాజాన్ని ప్రేమించగలం. ప్రేమగల కార్యాలకు ఉన్న లక్షణాలు: దేవుని ప్రేమ చూపడానికి చేసేవి, దేవునికి విధేయులమై చేసేవి, దేవుని బలంతో చేసేవి, సాధ్యమైనంత మందితో చేసేవి, దేవునికి స్తుతి కలిగేలా చేసేవి, స్థానికంగా ఉన్న వనరులతో చేసేవి, చిన్నవి, సామాన్యమైనవి.

**వస్తువులు**

1. స్థానిక వనరులకోసం చేసే దానికి చిన్న బహుమానం

***నిర్వాహకునికి సూచనలు***: *ఈ పాఠంలో ఒక ప్రేమగల కార్యానికి ఉన్న 7 గుణలక్షణాలు జ్ఞాపకం చేస్తాం. ఇవి సులువుగా గుర్తుంచుకోవడంకోసం, వాటిని చేతి సైగలుగా చెప్పమని మనం ప్రోత్సహిస్తాం. ఉదాహరణకు –దేవుని బలంతో చేయడం అన్నప్పుడు మీ రెండు చేతులను బిగించడం. దేవునికి విధేయులమై చేసేవి అనడానికి చేతులను ప్రార్థిస్తున్నట్లుగా పెట్టడం. ప్రతి లక్షణాన్ని మీరు పరిచయం చేసేటప్పుడు, ముందున్న లక్షణాలన్నిటికీ చేతి సైగలను చూడండి.*

## పరిచయం

**పెద్దబృందంతో చర్చ**

- మీ సమాజంలోని క్రైస్తవేతరులకు ప్రేమ చూపడానికి సంఘంగా మీరు సాధారణంగా చేసే పనులు కొన్ని చెప్పండి.
- అందులో ఎంతమంది పాల్గొంటారు?
- ఎంత తరచుగా మీరు వాటిని చేస్తారు?
- ఏమి చేయాలి అనేది ఎలా నిర్ణయిస్తారు?
- ప్రజలు ఎలా స్పందిస్తారు?
- మీరు వాటిని ఎందుకు చేస్తారు?

**ప్రేమగల కార్యాలు**
గత కొన్ని పాఠాల్లో దేవుడు ప్రతి ఒక్క వ్యక్తిని ఎంతగా ప్రేమిస్తున్నాడో మనం జ్ఞాపకం చేసుకున్నాం. మనం కూడా మన పొరుగువారిని ప్రేమించాలనే ఆజ్ఞ పొందామని చూసాం. అలా మనం చేయగల మార్గాల్లో ప్రేమగల కార్యాలు ఒకటి.

తమ సమాజానికి దేవుని ప్రేమ చూపించడానికి సంఘం చేసే చిన్నచిన్న కార్యక్రమాలే ప్రేమగల కార్యాలు. సాధారణంగా అవి ఒక్కరోజులో చేయగలిగే సామాన్యమైన పనులు.

ప్రేమగల కార్యానికి సంబంధించి ఏడు నిర్దిష్టమైన లక్షణాలు ఉన్నాయి. ఈ పాఠంలో ఆ ఏడు లక్షణాలను పున:సమీక్ష చేద్దాం.

1. **దేవుని ప్రేమ చూపడానికి చేసేవి**
   ప్రేమగల కార్యాల ముఖ్యమైన లక్ష్యాలలో ఒకటి మీ సమాజానికి దేవుని ప్రేమ చూపడం.

| |
|---|
| ఒక సమాజంలో ఉంటున్న సంఘం ఒక ప్రేమగల కార్యం చేయడానికి నిర్ణయించుకుంది. వారి ప్రాంతంలో ఉండే ఒక రౌడీ భార్యకు సహాయం చేయమని దేవుడు చెప్తున్నట్లు వాళ్ళు భావించారు. ఆ రౌడీకి చాలా తొందరగా కోపపడి, చిన్న చిన్న కారణాలకే ప్రజలను కొడతాడనే పేరు ఉంది కాబట్టి వాళ్ళు భయపడ్డారు. అయితే సంఘం దేవుని మాటకు విధేయత చూపాలని కోరుకుంది. ఆ రౌడీ ఊరిలో లేదని తెలుసుకునేవరకు వాళ్ళు ఎదురుచూసారు. అప్పుడు వాళ్ళు అతని భార్యకు సహాయం చేసి పొలంలో కోత కోయడానికి, ఆ పంటను అమ్మకానికి సిద్ధపరచడానికి సహాయం చేసారు. ఆ రౌడీ ఇంటికి తిరిగివచ్చినపుడు పంట అంతా కోసివుండడం చూసి, ‘‘ఇది ఎవరు చేసారు?’’ అని కేకలు వేసాడు. అతడు గొడవ చేస్తాడేమో అని భయపడి, అతని భార్య మొదట్లో చెప్పకపోయినా, తరువాత నెమ్మదిగా సంఘంలోని వారు సహాయం చేసారని చెప్పింది. |

ఆ రౌడీ సుడిగాలిలా సంఘంమీదకు వెళ్ళి తలుపు బాదాడు. సంఘపెద్దలు తన వెనుక నిలబడి వుండగా, పాస్టరు తలుపు తీసాడు. రౌడీ లోపలకి వచ్చి, ''మీరెందుకు ఇది చేసారు?'' అని దబాయించాడు. దేవుని ప్రేమను చూపడానికే అని వాళ్ళు సమాధానమిచ్చారు. తన జీవితంలో అంతవరకూ ఎవరూ తనను ప్రేమించలేదని చెబుతూ, ఆ వ్యక్తి కన్నీటిపర్యంతమయ్యాడు. అతడు క్రైస్తవుడుగా మారి తన జీవితం మార్చుకుని, తన గ్యాంగ్‌లోని మరొక ఆరు కుటుంబాలను క్రీస్తువద్దకు నడిపించాడు.

- ఈ ప్రేమగల కార్యంవల్ల వచ్చిన ప్రభావం ఏమిటి?
- ఆ రౌడీతో వారు సువార్తను మాత్రమే పంచుకుంటే అలాంటి స్పందన వచ్చేదని మీకు అనిపిస్తుందా?

ప్రేమగల కార్యానికి ఉన్న ముఖ్యమైన ఉద్దేశం మన పొరుగువారిని ప్రేమించాలనే దేవుని ఆజ్ఞకు విధేయత చూపించడం. దేవుని ప్రేమను మన సమాజానికి చూపించాలని మనం కోరుతాం. మొదటిలో మనం సాధారణంగా ప్రేమ చూపనివారిని గూర్చి ఆలోచించడం మంచిది. ఉదాహరణకు, సంఘానికి రానివారికి.

- క్రైస్తవేతరులకు దేవుని ప్రేమ చూపడం ముఖ్యమైన విషయం అని మీకు ఎందుకు అనిపిస్తుంది?
    - *క్రైస్తవేతరులలో అనేకులు దేవుని ప్రేమనుగూర్చి వినడానికి సంఘానికి రావడానికి ఇష్టపడరు. అయితే కథలో జరిగినట్లుగా, వాళ్ళు దేవుని ప్రేమను చూచినప్పుడు అది వారిపై తగిన ప్రభావం చూపే అవకాశం ఉంటుంది.*

## 2. దేవునికి విధేయత చూపడానికి చేసేది

ప్రతిదానివలెనే, మనం ఎల్లప్పుడూ దేవునికి విధేయులుగా నడుచుకునే విషయాన్ని నిశ్చయం చేసుకోవాలని మనం కోరుకుంటాం. అవసరతలను అర్థం చేసుకొని, సహాయం చేయడానికి మన సొంత ప్రణాళిక చేయడానికి సమాజంలో సర్వే చేయడానికి బదులు, దేవుడు మనం ఏమి చేయాలని కోరుతున్నాడు అనేది ప్రార్థనలో తెలుసుకోవాలని మనం కోరుకుంటాం. **కొన్నిసార్లు అత్యంత ఎక్కువ ప్రభావం చూపించే ప్రేమగలకార్యాలు మనకు అర్థంకాని విషయాలు.**

మనం ఇప్పుడే విన్న రౌడీ కథనుగూర్చి ఆలోచించండి.

- దేవుని ప్రేమను ఎవరికి చూపాలి అనేవిషయాన్ని సంఘం ఎలా నిర్ణయించుకుంది?
    - *సంఘం ప్రార్థించగా దేవుడు ఆ రౌడీని ప్రేమించాలని చూపించాడు.*
- సమాజంలో అవసరాలు ఏమిటి అని వాళ్ళు సర్వే చేసివుంటే ఆ రౌడీమీద దృష్టిపెట్టేవారని మీకనిపిస్తుందా?

రౌడీని ప్రేమించమని చెప్పినట్లుగా, కొన్నిసార్లు మనల్ని చేయమని దేవుడు చెప్పే విషయాలు మన ఆలోచనకు అర్థంకావు. కాని దేవుడు మనలను ఏదైనా చేయమని నడిపిస్తే, అది ఆయన కోరినది నెరవేరుస్తుందని, ఆయన ప్రణాళికలో పాల్గొనడంద్వారా మనం ఆశీర్వాదం పొందుతామని నిశ్చయంగా నమ్మవచ్చు.

## 3. చిన్నవి, సామాన్యమైనవి

మీరు ఈ ప్రేమగల కార్యాలు చేయడం ఆరంభించిన మొదటిలో, మీరు చాలా సామాన్యమైన కార్యాలను ఎంచుకోవాలని మేము ప్రోత్సహిస్తాం. వాటిని ఒక్కరోజులో చేయగలగాలి.

- ప్రేమగల కార్యాలు చిన్నవి, సామాన్యమైనవిగా ఆరంభించడం ప్రాముఖ్యం అని మీరెందుకు భావిస్తున్నారు?

ఈ నాలుగు ఆలోచనలు గమనించండి: మనం ఆరంభించేది ఏదైనా చిన్నదిగా, సామాన్యమైనదిగా ఉంటే....

1. **మనం దాన్ని పూర్తిచేయగలం**. మనం ఏదైనా పెద్దది చేస్తే, అది సాధించడానికి కష్టంగా ఉండి, భయం కలిగిస్తుంది. అయితే మనం ఏదైనా చిన్నది, సామాన్యమైనది చేస్తే అది మనం పూర్తిచేయగలిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
2. **ఎక్కువమంది పాల్గొనవచ్చు**. అది ఒక్కరోజులో లేక ఒక్క పూటలో చేయగలిగేది అని తెలిస్తే ప్రజలు చిన్న కార్యక్రమాలకోసం ముందుకు రావడం సులువు. ''నేను దాన్ని చేయగలను. ఆ రోజు/పూట నాకు పనేమీ లేదు'' అని వాళ్ళు అనుకుంటారు. కాని అది పూర్తిచేయడానికి చాలారోజులు పట్టే కార్యక్రమమైతే, ప్రజలు సమయం, వనరులు కేటాయించడానికి సంశయిస్తారు. ఇతరులకు ఏదైనా చేయడం అనే ఆలోచన వారికి కొత్తదిగా ఉంటే ఇది మరింత నిజం.

3. **మన నైపుణ్యాలను కట్టుకునే అవకాశం మనకు ఉంటుంది**. ఇలాంటి కార్యక్రమాలు చేయడానికి మనకు ఎక్కువ అనుభవం ఉండిఉండకపోవచ్చు. మనం ఏదైనా క్లిష్టమైనది ప్రయత్నించడానికి ముందు ఇలాంటి చిన్నది చేయడంద్వారా మనకు అనుభవం వచ్చే అవకాశం ఉంటుంది.
4. **మనం త్వరగా విజయం సాధించవచ్చు**. మనం చిన్న కార్యక్రమాలు చేసి విజయం సాధించినప్పుడు, అది చూచి మనతో చేరడానికి ఇతరులు ఆకర్షితులౌతారు. మీరు ఆరంభించిన మొదటిలో పాల్గొనడానికి సంఘంలో కొద్దిమంది మాత్రమే ఆసక్తి చూపవచ్చు. కాని మీరు మరింతగా బోధిస్తూ, విజయవంతమైన కార్యక్రమాలు చేస్తుంటే, ఇంకా అనేకులు పాల్గొనేందుకు ఆసక్తి చూపుతారు.

ఒక పెద్ద కార్యక్రమం కాకుండా, చిన్నవైనా ప్రేమగల కార్యాలు తరచుగా చేయడం మంచిది (వారానికి ఒకసారి లేక రెండువారాలకు ఒకసారి).చిన్నచిన్న ప్రేమగల కార్యాలు చేయడం, పైన చెప్పిన వాటితోపాటు, వాటిని తరచుగా చేయడంవల్ల సమాజంలోని ప్రజలు సంఘం వారిపట్ల ఎలా శ్రద్ధ చూపుతుందో అని గమనించి వారి మనసుల్లో మంచి ముద్ర వేయడానికి సహాయపడుతుంది కూడా.

## 4. స్థానిక వనరులను వాడుకుని చేసేది

**భాగస్వామ్య కార్యక్రమాలు**

మనం ఒక ఆట ఆడబోతున్నాం. ఏమాత్రం ఖర్చులేకుండా సంఘం ప్రజలకు సహాయం చేయగలిగే ప్రేమగల కార్యాలను చేయడానికి ఆలోచించండి. సాధ్యమైనన్ని కార్యక్రమాలు రాయడానికి ప్రయత్నించండి. ఐదు నిమిషాల్లో ఎక్కువ జవాబులు రాయగలిగిన వారికి బహుమానం దొరుకుతుంది.

***నిర్వాహకునికి సూచనలు**: రెండు నిమిషాల తర్వాత, తమ సంఘాలలో దానమివ్వగలిగే ప్రజల నైపుణ్యాలనుగూర్చి ఆలోచించమని వాళ్ళకు జ్ఞాపకం చేయండి. ఐదు నిమిషాల తర్వాత, వారు ఎన్ని ప్రేమగల కార్యాలనుగూర్చి ఆలోచించారో చెప్పమని వారిని ప్రోత్సహించండి. ఎక్కువ కార్యక్రమాలను ఆలోచించినవారికి ఏదైనా చిన్న బహుమతి, ఇష్టమైన తినే పదార్థం ఇవ్వండి.*

**పెద్దబృందంతో చర్చ**

- మీ సంఘం/సమాజంలోని వనరులను ఉపయోగించి ప్రేమగల కార్యాలను చేయడం ప్రాముఖ్యం అని మీరు ఎందుకు భావిస్తున్నారు?
  - **ప్రేమ చూపించడానికి అది మరింత మెరుగైనది**
    పాఠం 5లోని చీరల కథను తలపోయండి. ఆ సమాజంలోనివారికోసం ఒక పెద్ద సంస్థ చీరలు కొనివుంటే అంత ప్రభావం ఉండేదని మీరు అనుకుంటున్నారా? ఏమాత్రం కాదు.
    - సంఘం తమను ప్రేమిస్తుందని ప్రజలు ఎందుకు భావించారు ?

      *ఎందుకంటే త్యాగపూరితంగా ఇచ్చిన సంఘపు ప్రేమను వాళ్ళు చూచారు. అందులో ఎలాంటి త్యాగం లేక కృషి జరగలేదని సమాజంలోనివాళ్ళు భావిస్తే, అదేవిధంగా తమపట్ల దేవునికి ప్రేమ ఉందనే విషయాన్ని వాళ్ళు చూడరు.*

  - **ఇచ్చుటలోని ఆశీర్వాదం.** 2కొరింథి 9:6–11 చదవండి. మనం ఎంత ఇస్తామో అంతే కొలతతో మనకు ఇస్తానని దేవుడు చెప్పాడు. అయినా, ఈ వచనాలు మరలా చూడండి.
    - దేవుడు మనలను ఎందుకు ఆశీర్వదిస్తాడు?
      1. ప్రతిసారి మనం దాతృత్వంగా ఉండడానికి.
      2. దేవునికి స్తుతి కలుగునట్లు.

    సంఘాలు దాతృత్వం కలిగి ఇస్తే, అవి దేవుని ఆశీర్వాదం పొందడం మనం చూసాం. ఆ సంఘాలు పేదరికంనుండి బయటపడడం ఆరంభించాయి. కాని దానికంటే ముఖ్యంగా, వారు మరింత దాతృత్వం కలిగి, మరిన్ని ప్రేమగల కార్యాలు చేయగలిగారు.

## 5. దేవుని బలంద్వారా చేయడం

యోహాను 15:1–8 చదవండి.

- మనకు మనంగా ఎంత చేయగలమని ఈ వాక్యభాగం చెబుతుంది? దీని అర్థం ఏమిటని మీకనిపిస్తుంది?
- మనం బహుగా ఎలా ఫలించగలం?

ప్రజలకు సహాయం చేయడం చాలా కష్టం కావచ్చు. మన సమాజాలలో జరగాలని మనం ఆశించే మార్పును దేవుడు మాత్రమే తీసుకురాగలడు. ప్రేమగల కార్యాలద్వారా మన సమాజంలో మార్పు చూడాలని మనం కోరితే, మని నిజంగా దేవునివైపు చూచి, ఆయన సహాయాన్ని అర్థించాల్సివుంది.

మనం ప్రేమగల కార్యం చేయడానికి ముందు, అది చేస్తున్నపుడు, దాని తర్వాత ఎల్లప్పుడూ ప్రార్థన చేస్తూ ఉండాలి. ఏదైనా సవాలు లేక ఆటంకం వచ్చినపుడు, దానిలోనుండి మార్గాన్ని కలుగజేయమని దేవుని అడగాల్సిన అవసరం ఉంది. మనం అలసిపోయినా లేక నిరుత్సాహపడినా, ముందుకు కొనసాగడానికి కావలసిన బలంకోసం మనం దేవునిలో నమ్మకముంచాలి.

### 6. సాధ్యమైనంత ఎక్కువమందిని పాల్గొనేలా చేయాలి
### పెద్దబృందంతో చేసేది

***నిర్వాహకునికి సూచనలు***: *బృందాన్ని ఎ, బి అనే రెండు బృందాలుగా విభజించండి. ఎ బృందంలోనివారికి ప్రతినిధిగా ఒకరిని ఎంచుకోమని చెప్పండి. రెండవ బృందంలో ప్రతి ఒక్కరూ పాల్గొంటారని చెప్పండి. వాళ్ళకు దొరికి దేనినైనా ఉపయోగించి ఆ రెండు బృందాలు గదిలోని రెండు గోడలను కలిపేటట్లు ఉండాలని వివరించండి. 'ఎ' బృందంలో వారు ఎంచుకున్న వ్యక్తి అన్ని పనులూ చేయాలి. కాని అతడు బృందంలోని మిగిలినవారినుండి వస్తువులు అడగవచ్చు. 'బి' బృందంలో ప్రతివారూ కలసి దొరికిన వస్తువులతో గది రెండు గోడలను కలపవచ్చు. బృందంలో మిగిలినవారు ఎవరూ ఇది జరిగేటప్పుడు మాట్లాడకూడదని 'ఎ' బృందంలోనివారికి వివరించండి. (ఒకవేళ వాళ్ళు మాట్లాడితే, ''నిశ్శబ్దంగా ఉండండి, పరిచర్య జట్టు పనిచేస్తుంది'' అని చెప్పండి.)*

రెండు బృందాలూ పూర్తిచేసిన తర్వాత, ఈ ప్రశ్నలు అడగండి:

- ఎవరు ముందు పూర్తిచేసారు?
- ఇలా చేయడంనుండి మనం ఏమి నేర్చుకోవచ్చని మీరు భావిస్తున్నారు?
- బృందం ఎ
    - ఒక్కడే పని అంతా చేయడం ఎలా అనిపించింది?
    - మీలో మిగిలిన వారికి ఎలా అనిపించింది? మీరు కూడా చేయాలని ఆశించారా?
- బృందం బి
    - అనేకమంది కలసి పనిచేయడంవల్ల కలిగే లాభాలు ఏమిటని మీకనిపించింది?
- మనం ప్రేమగల కార్యాలు చేసినప్పుడు, సాధ్యమైనంత ఎక్కువమందిని పాల్గొనేటట్లు చేస్తాం. అది ముఖ్యమైనది అని మీకు ఎందుకు అనిపిస్తుంది?

తరచుగా సంఘంలో పనంతా కొద్దిమందే చేస్తారు. వాళ్ళు త్వరగా అలసిపోయి, మానేయాలని తలస్తారు. అదే సమయంలో మిగిలినవాళ్ళందరికీ విసుగ్గా అనిపించడం లేక వాళ్ళ తలాంతులు వాడబడడం లేదని భావించడం జరగవచ్చు. వాళ్ళు తమ నైపుణ్యాలు లేక విశ్వాసంలో ఎదగరు. కొన్నిసార్లు మనకే పాలుపంపులు లేకుండా డబ్బులు మాత్రమే ఇవ్వమని అడిగితే కొందరు బాధపడవచ్చు. మనం ప్రేమగల కార్యం చేసినప్పుడు, మీరు చేసే పనిలో సంఘంలో ఎంతమందిని సాధ్యమైతే అంతమందిని పాల్గొనేటట్లు చేయాలి. అప్పుడు మనం అనేకమంది సృజనాత్మకత, శక్తివల్ల లబ్దిపొందుతాం. ప్రేమగల కార్యం మంచిగా చేయడం అంటే అందరూ డబ్బు ఇవ్వడంలో కాక అందరూ కలసి చేయడంలో ఉంటుంది. వేరే సంఘాలలో అందరూ కలసి పాల్గొన్న కొన్ని కార్యక్రమాలు: కాలువ/నీళ్ళను శుభ్రం చేయడం, మురికి కాల్వలు లేక రోడ్లమీద చెత్తను శుభ్రం చేయడం, ఒక వైద్యశాలను శుభ్రం చేయడం.

### 7. దేవునికి మహిమకలిగేటట్లు చేయాలి

యోహాను 15:8 మరలా చదవండి.

- బహుగా ఫలించడంలోని ఉద్దేశం ఏమిటి?

మత్తయి 5:13–16 చదవండి.

- మనం సత్క్రియలు ఎందుకు చేస్తాం?
- మనం ప్రేమగల కార్యాలు చేసినప్పుడు, మన ఉద్దేశం/లక్ష్యం ఏమై ఉండాలి?

మనం ఒక ప్రేమగల కార్యం చేసిన ప్రతిసారి, దాన్ని ఎలా చేసాం అని పరిశీలించుకోవాలి. దాని ఫలితం ఏమిటి? మూడు విషయాలు ఆలోచించండి:

1. ప్రజలకు ఏమైనా సహాయపడిరదా?
2. ఆ కార్యక్రమం ప్రేమపూర్వకంగా జరిగిందా?
3. దేవునికి స్తుతి కలిగిందా?

కొన్నిసార్లు మనం చేసిన ప్రేమగల కార్యం చూసినవారు దేవునిగూర్చి వినడానికి ఇష్టపడడం మనం చూడవచ్చు. కాని అన్నిసార్లు అలా జరగాలని లేదు. నిజం ఏమిటంటే, మనం ఒక ప్రేమగల కార్యం చేసిన ప్రతిసారి దేవునిగూర్చి మాట్లాడే అవకాశం దొరకక పోవచ్చు. కాని దేవుని ఘనపరచేటట్లుగా మనం పనులు చేసిన ప్రతిసారి దేవుని మహిమపరచడానికి మనం ప్రయత్నించవచ్చు. ఇతరులకు సేవ చేయాలనే మన ఉద్దేశం, మన వైఖరి, మన సంతోషం కూడా దేవునికి మహిమ, స్తుతి కలిగేటట్లు ఉండవచ్చు.

## ముగింపు

***నిర్వాహకునికి సూచనలు:*** *తరువాత పాఠంలో మనం ఒక ప్రేమగల కార్యం చేయబోతున్నాం అని వివరించండి. మీరు ఈ పాఠాలను వారం వారం బోధిస్తుంటే, మీ సంఘం చేయగల ప్రేమగల కార్యంకోసం ఈ వారం అంతా ఆలోచించడానికి సమయం తీసుకోండి.*

*చేతితో చేసే సైగలను ఇంకా కొన్నిసార్లు అభ్యసించి ముగించండి.*

# పాఠం 9: ప్రేమగల కార్యం నిర్వహించడం

**ముఖ్యమైన తలంపు**
ఒక ప్రేమగల కార్యం సిద్ధం చేయడానికి సమయం ఇవ్వడమే ఈ పాఠం ఉద్దేశం.

**వస్తువులు**

1. ఐదుగురు లేక ఏడుమందికి పెద్ద కాగితాలు

## ఇద్దరు సోదరుల ఉపమానం

మత్తయి 21:28–32 చదవండి.

- తండ్రి కుమారులకు ఏమి చేయమని చెప్పాడు? (*ద్రాక్షతోటలో పనిచేయమని*)
- ఇద్దరు కుమారులూ తమ తండ్రి చిత్తాన్ని అర్థం చేసుకున్నారా? (*చేసుకున్నారు*)
- ఇద్దరు కుమారులలో ఉన్న వ్యత్యాసం ఏమిటి?
    - *మొదటి కుమారుడు తన తండ్రికి విధేయత చూపనని అన్నాడు, కాని తన మనస్సు మార్చుకుని విధేయత చూపాడు.*
    - *రెండవ కుమారుడు విధేయత చూపుతానని చెప్పి, విధేయత చూపలేదు.*
- యేసు ఏ కుమారుని మెచ్చుకున్నాడు? (*విధేయుడైన కుమారుడ్ని)*

ఈ ఉపమానం ఉపయోగించి మత నాయకుల అవిధేయతను యేసు బయటపెడుతున్నాడు. దేవుని ప్రేమిస్తున్నామని చెబుతూ అవిధేయులైన మతనాయకులకంటె ముందు మారుమనస్సు పొంది విధేయత చూపించడం ఆరంభించిన సుంకరులు (అవినీతిపరులైన ప్రభుత్వాధికారులు), వేశ్యలు దేవుని రాజ్యంలోకి ప్రవేశిస్తారు అని ఆయన చెప్పాడు.

దేవుని సత్యాలు ప్రకటించబడుతుండగా వినడం, వాటిని అధ్యయనం చేస్తే సరిపోదు. దేవుని సత్యాన్ని మనం ఇప్పుడు ఆచరణలో పెట్టాలి. దేవుడు మన ప్రేమపూర్వక విధేయతను ఆశిస్తున్నాడు. దేవుని ప్రేమించడం, మనవలె మన పొరుగువారిని ప్రేమించడం దేవుని చిత్తమని మనకు తెలుసు. మన ప్రేమగల కార్యాలద్వారా ఇతరులను ప్రేమించి మనం దేవుని చిత్తానికి విధేయులుగా మారడం ఆరంభించాల్సివుండి.

మనం నేర్చుకుంటూ ఉన్నదాన్ని ఆచరణలో పెడితే తప్ప మన సమాజాలు, మన జీవితాలు మారవు. మనం ఆచరణ ఆరంభించడానికి సహాయం చేసే ఒక కార్యక్రమాన్ని ఆరంభిద్దాం రండి!

## ప్రణాళిక దశలు

**చిన్నబృందంతో చర్చ (ఐదునుండి ఏడుగురు)**
***నిర్వాహకునికి సూచనలు***: *మీరు స్థానిక సంఘంలో బోధిస్తూ ఉంటే, మొత్తం అందరూ ఒక బృందంగా దీన్ని చేయడం మీకు సాధ్యమౌతుంది. కింద ఇచ్చిన ఒక్కొక్క దశలో బృందాన్ని నడిపించండి.*

**దశ 1: ప్రార్థించండి**
మొదటిగా చేయాల్సింది ప్రార్థన. ఇప్పుడు ప్రార్థించడానికి సమయం తీసుకోండి. మీ ప్రేమపూర్వక కార్యానికి మీరు ఏమి చేయాలో చూపమని దేవుని అడగండి. దేవుని స్వరాన్ని వినడానికి తప్పకుండా కొన్ని నిమిషాల సమయం నిశ్శబ్దంగా కనిపెట్టండి.

**దశ 2: ఒక కార్యాన్ని ఎంచుకోండి**
ఒక బృందంగా, మీరు చేయగల ఒక ప్రేమగల కార్యం నిర్ణయించుకోండి. దేవుడు ఎలాంటి ప్రేరణనైనా ఇస్తున్నాడా? ఒక మంచి ప్రేమగల కార్యం ఏదో ఎవరికైనా ఆలోచనలు ఉన్నాయా, చెప్పమని అడగండి. పాఠం 5లో (సంఘం సహాయం చేయాలని దేవుడు కోరుతున్నాడు),

పాఠం 6లో (మీరు సహాయం చేయగల కొన్ని అవసరతలు) మీరు రాసిన కొన్ని ఆలోచనలు కూడా చూడండి. దేవుడు మిమ్మల్ని ఏమి చేయడానికి నడిపిస్తున్నాడని మీరు భావిస్తున్నారో కలసి ఏకీభవించండి.

మీరు ఒక అంశాన్ని ఎంచుకున్న తర్వాత, మీరు దాన్ని ఒక్కరోజులోనే చేయగలిగేది ఉండేటట్లు చూచుకోండి. కొన్ని బృందాలు మరీ పెద్ద పనులు ఎంచుకుంటారు. మీరు ఒక్కరోజులో, స్థానిక వనరులతో, సాధ్యమైనంత మంది ప్రజలు పాల్గొనేటట్లు చేసే విషయాన్ని గూర్చి ఆలోచిస్తూ ఉండండి.

మీరు చిన్న బృందాలలో ప్రణాళికలు చేస్తుంటే, ప్రతి బృందం తమ ఆలోచనను చెప్పడానికి అవకాశం ఇచ్చి, మిగిలినవారు దానిగూర్చి ఏమి చెబుతారో వినండి.

- అది ప్రేమను కనుపరస్తుందా?
- అది సామాన్యమైనది, చిన్నదేనా?
- అది మీకు అందుబాటులో ఉన్న వనరులతో చేయగలరా?
- దానిలో సాధ్యమైనంత ఎక్కువమంది పాల్గొనేటట్లు ఉందా?

**దశ 3: ఒక ప్రణాళిక సిద్ధం చేయండి**

క్రింద ఇచ్చిన ప్రశ్నలు చర్చించండి. సాధ్యమైతే, మీరు మర్చిపోకుండా ఉండేటట్లు వీటికి జవాబులను ఎవరిచేతనైనా రాయించండి.

- మీరేమి చేయబోతున్నారు?
- మీకు అవసరమయ్యే వనరులు ఏమిటి? అవి మీకు ఎక్కడ దొరుకుతాయి? ఎవరు వాటిని తెస్తారు?
- మీరు ఎవరికి సహాయం చేయబోతున్నారు?
- సహాయం చేయడంలో ఎవరు పాల్గొంటారు? అందర్నీ ఆహ్వానించేవారు ఎవరు?
- ఏ రోజున అది మీరు చేయబోతున్నారు?

***నిర్వాహకునికి సూచనలు***: *ఒకవేళ క్లాసు చిన్న బృందాలుగా పని చేస్తుంటే, ప్రతి బృందం వారి ప్రణాళికను చెప్పడానికి అవకాశం ఇవ్వండి. ఆ ప్రణాళికలను బలపరచడానికి బృందంలో ఎవరైనా సూచనలు ఇస్తారేమో అడగండి.*

**దశ 4: ప్రార్థించండి**

మీరు ప్రణాళిక రాయడం ముగించిన తర్వాత, మరలా ప్రార్థించడానికి సమయం తీసుకోండి. ఆ కార్యక్రమాన్ని పూర్తి చేయడానికి సహాయం చేయమని దేవుని అడిగి, ఫలితాలను అత్యధికం చేయమని ప్రార్థించండి. ఆయన నామం మహిమపరచబడునట్లు ప్రార్థించండి. మీరు మీ కార్యక్రమానికి సిద్ధపడుతుండగా, వచ్చే వారం రెండు వారాల్లో, దేవుడు మీకు ఆ కార్యక్రమంలో సహాయం చేయాలని మీరు ప్రార్థిస్తూ ఉండాలి.

***నిర్వాహకునికి సూచనలు***: *మరొక రెండు దశలు ఉన్నాయి కాని వాటిని మనం ఈ రోజు చేయడం లేదు అని బృ:ందానికి వివరించండి. తరువాత మిగిలిన రెండు దశల వివరణను చదవండి.*

**దశ 5: ప్రాజెక్టు/కార్యక్రమం చేయండి**

తరువాత దశ మీరు ప్రణాళిక చేసిన కార్యక్రమాన్ని చేయడం. ప్రార్థనతో ఆ రోజును ఆరంభించి, మీ ప్రయత్నాలను దేవునికి అంకితం చేయండి. మీ సమాజానికి దేవుని ప్రేమను కనుపరచడానికి మీరు ఈ కార్యక్రమం చేస్తున్నారని గుర్తుంచుకోండి. ఈ లక్ష్యానికి సరిపోలే వైఖరిని చూపడానికి ప్రయత్నించండి.

**దశ 6: అంచనా వేసి/పరీక్షించి, నివేదించండి**

చివరి దశ నివేదన చేసి మూల్యాంకనం/అంచనా వేయడం. ఎందుకు మనం పరీక్షించుకోవాలి? ఎందుకంటే మనం నేర్చుకోవడానికి అది సహాయం చేస్తుంది. మనం ఏది బాగా చేసామో ఆలోచించవచ్చు, ఇంకా వచ్చేసారి దేనిని మెరుగుగా చేయగలమో తెలుసుకోవచ్చు. అది సుదీర్ఘమైన ప్రక్రియ కానవసరం లేదు. ఈ ప్రశ్నలను కొద్ది నిమిషాలు తీసుకుని చర్చిస్తే చాలు:

- ఏది బాగా జరిగింది?
- ఏది బాగా జరగలేదు?
- మీ ప్రణాళికలో దేనిని మీరు మెరుగుచేయగలరు?

- స్పందన మీరు ఉద్దేశించినట్లుగా ఉందా? లేకుంటే, ఎందుకు లేదు?
- దేవుడు మహిమపరచబడ్డాడా?

## ముగింపు

మనం కరదీపిక /మాడ్యూల్ 1 పూర్తిచేసాం.

**చిన్నబృందంతో చర్చ**
ఈ తర్ఫీదునుండి మీకు జ్ఞాపకం ఉన్న కొన్ని ముఖ్యమైన ఆలోచనలను చిన్నబృందాలలో చర్చించడానికి సమయం కేటాయించండి.

- వచ్చేవారం మీరు భిన్నంగా చేయాలని ఆశించే కొన్ని విషయాలు ఏమిటి?

మనం ముగిస్తూ ఉండగా, మత్తయి 21:28–31లోని ఇద్దరు కుమారుల కథను జ్ఞాపకం చేసుకుందాం. ఈ కథలో ఒక కుమారుడు తన తండ్రికి విధేయత చూపుతానని చెప్పి విధేయత చూపలేదు. రెండవ కుమారుడు తాను విధేయత చూపను అనిచెప్పి విధేయుడై ఆ పని చేసాడు. విధేయుడైనవానిని యేసు మెచ్చుకున్నాడు. వచ్చి అధ్యయనంలో పాల్గొంటే సరిపోదు. దాన్ని మనం ఆచరణలో పెట్టాలి. మనం నేర్చుకుంటున్నవాటిని ఆచరణలో పెడితే తప్ప మన సమాజాలు, మన జీవితాలు మారవు. ఒకటి లేక అంతకంటే ఎక్కువ ప్రేమగల కార్యాలు చేయడం ద్వారా ఇతరులను ప్రేమించడం మీరు ఆరంభించవచ్చు.

***నిర్వాహకునికి సూచనలు***: *తాము నేర్చుకుంటున్నవాటిని ఆచరణలో పెట్టడానికి దేవుడు వారికి సహాయం చేయులాగున బృందంలోనివారికోసం ప్రార్థించండి.*